PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 31 | విజయవాడ, శనివారం 31 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 31 August 2024 | Rs



రాష్ట్రవ్యాప్తంగా జోరు వానలు

- నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు
- 45-55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

2

## చరిత్ర సృష్టించిన అవని



వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ స్వర్ణం

మనీష్‌కు రజతం, మోనాకు కాంస్యం

100మీ. పరుగులో ప్రీతికి రికార్డు పతకం

ఒకేరోజు భారత్‌కు నాలుగు పతకాలు

8

# గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో దారుణం

**బాలికల వసతి గృహం వాష్‌రూములో రహస్య కెమెరాల కలకలం • అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు విద్యార్థినుల నిరసన**



కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన

**ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, గుడ్లవల్లేరు, అమరావతి బ్యూరో**

కృష్ణా జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతి గృహం వాష్‌రూమ్‌లో రహస్య కెమెరాలు పెట్టి వీడియోలు తీస్తున్నారని విద్యార్థినులు అర్ధరాత్రి సమయంలో ఆందోళనకు దిగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మహిళా కమిషన్ సుమోటోగా కేసు తీసుకుంది. విద్యార్థి సంఘాలు ఉద్యమించాయి. జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి ఈ ఘటనను తీసుకెళతామని విద్యార్థులు తెలిపారు. పోలీసులు మాత్రం రహస్య కెమెరాలు ఏవీ దొరకలేదని చెప్తున్నారు. గుడివాడ మండలం గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతి గృహం వాష్‌రూమ్‌లో హిడెన్ కెమెరాలు అమర్చినట్లు. ఓ విద్యార్థిని సాయంతో బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి విజయ్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు విద్యార్థులు చెబుతున్నారు. దీనిపై వారం రోజుల క్రితమే కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా సాక్ష్యాలు కావాలంటూ చర్యలు తీసుకోకపోవడంతో గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం తెల్లవారుజాము మూడు గంటల వరకూ సెల్‌ఫోన్ టార్చ్ లైట్లు వేస్తూ వసతి గృహం వద్దే నిరసనకు దిగారు. వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. ఈ ఘటనకు కారణమైన విజయ్‌పై విద్యార్థులు దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు మాట్లాడుతూ, 'వాష్‌రూమ్‌లో కెమెరాలు అమర్చి వీడియోలు తీశారు. ఆ వీడియోలను అమ్ముకుంటున్నారు' అని వాపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విజయ్‌ను విచారించి కేసు నమోదు చేసి అతడి ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను అదుపు చేశారు. బాలికల వసతి గృహంలో హిడెన్ కెమెరా గుర్తించారంటూ 'ఎక్స్' వేదికగా కొందరు విద్యార్థులు పోస్టులు పెట్టారు. విద్యార్థినులకు సంబంధించి దాదాపు 300 వీడియోలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సెప్టెంబర్ మూడో తేదీ వరకూ కళాశాలకు యాజమాన్యం సెలవు ప్రకటించింది.

**విద్యార్థి సంఘాల ఆందోళన**

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మద్దతుగా శుక్రవారం ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. వసతి గృహంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, విద్యార్థి సంఘాల నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి విచారణా చేయకుండా కెమెరాలు లేవని పోలీసులు చెప్పడంపై విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విచారణ సక్రమంగా జరగకపోతే రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

**సమగ్ర విచారణకు ఎస్ఎఫ్ఐ డిమాండ్**

ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ డిమాండ్ చేశారు. కళాశాలల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఒక ప్రకటనలో కోరారు. ఉన్నత చదువుల కోసం వస్తున్న విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు తప్ప, రక్షణ గురించి యాజమాన్యం ఆలోచించడం లేదని విమర్శించారు. వీడియోలు రికార్డింగు చేశారన్న అనుమానాలు విద్యార్థినులు లేవనెత్తారని, ఈ విషయంపై కళాశాల యాజమాన్యం తీరు సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ ఘటనపై వెంటనే ఉన్నతస్థాయి కమిటీ వేసి ఎంతటి వారైనా బాధ్యులపై మిగతా 7లో

## కారకులపై కఠిన చర్యలు : సిఎం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఘటనలో నేరం రుజువైతే కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. విద్యార్థినిల ఆందోళనల నేపథ్యంలో డిజిపి, ఇంటిలిజెన్స్ డిజిలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్‌పిలతోనూ మాట్లాడారు. తక్షణమే కళాశాలకు వెళ్లాలని మంత్రి కొల్లు రవీంద్రను ఆదేశించారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తేలితే వారిపైన కూడా కేసులు నమోదు చేయాలని, కళాశాలపైనా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థినుల బాధను అర్థం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థినుల కుటుంబాలకు భరోసా కల్పించాలని, ఘటన నిర్ధారణ అయితే కారకులను వదలొద్దని అన్నారు. అదే సమయంలో విద్యార్థినులకూ ధైర్యం చెప్పాలని, అండగా ఉంటామని హామీనివ్వాలని సూచించారు.

**జైత్వాని విషయంలోనూ ఆగ్రహం**

బాలివుడ్ నటి జైత్వాని విషయంలో ఏస్థాయి వ్యక్తులు, అధికారులు ఉన్నా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. ఎక్కడో మహారాష్ట్రలో జరిగిన అంశాన్ని ఇక్కడకు తీసుకొచ్చి ఇక్కడ కేసు పెట్టి వేధించడం ఇవన్నీ చూస్తుంటే వైసిపి పాలకులకు ఆడపిల్లలంటే కనీస గౌరవం లేదని అర్థమవుతోందన్నారు.

# కృష్ణా జలాల తేనెతుట్టెను కదిపారు

- అమరావతి నిర్మాణానికి, నీటిపంపకాలకు లింకు
- పులిచింతల పైనా కన్ను
- తెలుగు గంగకూ లెక్కలన్న బ్రిజేష్ ట్రిబ్యునల్
- బిజెపి విద్వేష వ్యూహమా?

**ప్రజాశక్తి - అమరావతి**

కేంద్ర ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో తేనెతుట్టెను కదిపింది. వివాద పరిష్కారానికి ఏర్పాటైన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ దానికి భిన్నంగా వ్యవహరించింది. తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించడానికి బదులు కొత్త వివాదాలను తాజాగా సృష్టించింది. ఫలితంగా రానున్న రోజుల్లో కృష్ణా జలాల పంపిణీ వివాదం మరింత క్లిష్టంగా మారనుంది. తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు రగిలించి, రాజకీయ ప్రయోజనం పొందాలన్న బిజెపి వ్యూహం దీని వెనుక ఉందన్న అభిప్రాయం పరిశీలకుల నుండి బలంగా వ్యక్తమవుతోంది. ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలను పంపిణీ చేసే బాధ్యత ట్రిబ్యునల్‌దే. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అక్కడి రాజకీయ ప్రయోజనాల కోసం కృష్ణా ట్రిబ్యునల్ తీర్పును పున:సమీక్షించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. అదే విధంగా కర్ణాటక ఎన్నికల సమయంలోనూ అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించింది. కేంద్రంలోని బిజెపి ఆ రెండు ఎగువ రాష్ట్రాల్లో ఎన్నికల ప్రయోజనాల కోసం తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు వ్యతిరేకమైనవే కావడం గమనార్హం. కేంద్ర కేబినెట్ ఆదేశాల మేరకు. కొంత కాలంగా రెండు రాష్ట్రాల వాదనలు వింటున్న ట్రిబ్యునల్ తాజాగా విచారణాంశాల జాబితాను విడుదల చేసింది. 40 అంశాలతో పేర్కొన్న ఆ జాబితా కొత్త వివాదాలను రేపేలా ఉండటం గమనార్హం. అమరావతి నిర్మాణానికి, నీటి కేటాయింపులకు కూడా ట్రిబ్యునల్ లింకు పెట్టింది. 'కృష్ణా డెల్టాలో సిఆర్‌డిఎను అభివృద్ధి చేస్తున్నందువల్ల ఆయకట్టు తగ్గుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సాగర్ కుడి, ఎడమ కాలువలకు ప్రాజెక్టుల వారీగా కేటాయింపులను పున: పంపిణీ చేయాలని ట్రిబ్యునల్ ప్రతిపాదించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన నోట్‌లో 14వ అంశంగా దీనిని పేర్కొన్నారు.

**ఆయకట్టు లేకపోయినా...**

నాగార్జున సాగర్‌కు దిగువన నిర్మించిన పులిచింతల ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఎటువంటి ఆయకట్టు లేని విషయం కృష్ణా డెల్టాకు నీటి స్థిరీకరణకోసమే ఈ ప్రాజెక్టును నిర్మించిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా నీటి పంపిణీకి పరిశీలించాల్సిన అంశాల్లో పులిచింతలను కూడా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ చేర్చింది. ' నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు వినియోగించే నీటిలో భాగంగా పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ' ను ట్రిబ్యునల్ ప్రస్తావించింది. అదే విధంగా ప్రకాశం బ్యారేజి నుండి పులిచింతలకు ఎత్తిపోసే నీటిని, నూతనంగా కట్టనున్న బ్యారేజీలను ( రాజధాని అవసరాలకోసం మూడు బ్యారేజి నిర్మాణాలను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే) నీటి వినియోగ లెక్కల్లోకి తీసుకోవాలని ప్రతిపాదించింది. ఇక్కడ ట్రిబ్యునల్ ప్రతిపాదించిన ఎత్తిపోతలగాని, నూతన బ్యారేజీల నిర్మాణంగానీ ఇప్పటి వరకు ప్రారంభం కూడా కానీ విషయం తెలిసిందే. లేని వాటిని కూడా 'లెక్కిస్తాం' అని ట్రిబ్యునల్ పేర్కొంది.

**తాగే నీటికీ లెక్కలు తీస్తారట...**

తమిళనాడు ప్రజల తాగునీటి అవసరాలకోసం ఉద్దేశించిన తెలుగుగంగ నీటిని కూడా లెక్కించి, తెలంగాణలోని బేసిన్ ప్రాజెక్టులకు కేటాయించే అంశాన్ని కూడా పరిశీలించనున్నట్లు ట్రిబ్యునల్ పేర్కొంది. ఆర్‌డిఎస్ కుడి కాలువకు కేటాయించిన నీటిలో 65 శాతం తెలుగుగంగకు కేటాయించినవని పేర్కొంది. బేసిన్ అవసరాలకే తొలి మిగతా 7లో

## వైసిపికి షాక్

- పార్టీకి, పదవులకు మరో ఇద్దరు ఎమ్మెల్సీల రాజీనామా

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఇటీవల ఎమ్మెల్సీ పోతుల సునీత, ఇద్దరు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు పార్టీకి, పదవులకు రాజీనామా చేయగా, శుక్రవారం ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి పార్టీకి, పదవులకు రాజీనామా చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన కర్రి పద్మశ్రీకి పదవీ కాలం ఆగస్టు 2029 వరకూ ఉంది. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లూరు జిల్లాకు చెందిన బల్లి కల్యాణ్ చక్రవర్తికి 2027 మార్చి వరకు పదవీ కాలం వుంది. కల్యాణ్ చక్రవర్తి తండ్రి బల్లి దుర్గా ప్రసాద్ 2019 ఎన్నికలకు ముందు టిడిపి నుంచి వైసిపిలో చేరి తిరుపతి ఎంపిగా ఎన్నికయ్యారు. దుర్గాప్రసాద్ మరణించడంతో కల్యాణ్ చక్రవర్తిని వైసిపి శాసనమండలికి పంపి, గురుమూర్తిని పార్లమెంటుకు పంపింది. వరుస రాజీనామాలు వైసిపిని కలవరపెడుతున్నాయి.

# అడవుల విధ్వంసం సహించబోం

- ప్రతి నియోజకవర్గంలో నగర వనం
- నాగార్జునసాగర్-శ్రీశైలం పరిధిలో పులుల సంరక్షణ జోన్
- వనమహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పవన్‌కల్యాణ్‌తో కలిసి మొక్కలు నాటిన సిఎం



వనమహోత్సవంలో మొక్కను నాటుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, సిఎం చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

అడవులను విధ్వంసం చేస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. డ్రోన్ పర్యవేక్షణతో అడవులపై నిఘా ఉంటుందని, హాని తలపెట్టాలని ఎవరైనా అడుగుపెడితే అదే వారికి చివరి రోజు అని వెల్లడించారు. హరితాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో శుక్రవారం జరగాల్సిన వనమహోత్సవ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం, అటవీ, పర్యావరణశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ హాజరుకావాల్సి ఉంది. వర్షం కారణంగా ఆ పర్యటన రద్దవ్వడంతో మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఉన్న ఎకో పార్కులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెరొక మొక్కను నాటారు. అనంతరం అక్కడ పాఠశాల విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు కావాలంటే మొక్కలు పెంచాలని చెప్పారు. ప్రకృతి ప్రజల ఆస్తి అని, దానిని అందరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి 13 వన్యప్రాణ సంరక్షణ కేంద్రాలు, 3 నేషనల్ పార్కులు, 2 జూలాజికల్ పార్కులు, ఒక టైగర్ పార్క్, ఎలిఫెంట్ శాంచ్యురీ వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. నాగార్జున సాగర్ - శ్రీశైలం మధ్యలో 5,300 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద టైగర్ సంరక్షణ కేంద్రం వస్తుందని చెప్పారు. పవన్‌కల్యాణ్ ఆధ్వర్యాన రాష్ట్రంలో 32 కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో నగర వనాలను పెంచుతామని, 2047 నాటికి పచ్చదనంలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలుపుతామని వెల్లడించారు. పవన్‌కల్యాణ్ ప్రతిపాదించిన మిగతా 7లో

## బిజెపి కోసం వివాదం చేయడం సరికాదు

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం కృష్ణాజలాల అంశాన్ని రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈమేరకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ విభజన చట్టంలో కృష్ణాజలాల పంపకంపై స్పష్టమైన నిర్ణయం ఉన్నప్పటికీ 2023 సంవత్సరంలో తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, తెలంగాణలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ రెండూ కలిపి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కృష్ణా జలాల వివాదాన్ని ముందుకు తీసుకొచ్చాయని తెలిపారు.

ట్రిబ్యునల్ ముందుకు వచ్చిన కృష్ణాజలాల వివాద అంశంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం తన వాదన వినిపించాలని వి కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# సెప్టెంబర్‌లోనూ కందిపప్పు లేనట్టే!

- అరకొరగా పంచదార, గోధుమపిండి
- బియ్యంతోనే సరి!

**ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి**

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై ఊరిస్తూ వస్తున్న ప్రభుత్వం సెప్టెబర్ నెలకు సంబంధించి కూడా చేతులెత్తేసింది. బియ్యంతోనే సరిపెట్టనుంది. అరకొరగా పంచదార, గోధుమపిండి అందించనుంది. ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత నెలలో కొన్ని ప్రాంతాల్లో పంచదార, గోధుమపిండి, రాగులు ఇచ్చిన పరిస్థితి ఉండగా, ఈసారి అవి అందరికీ దక్కేలా లేవు. జిల్లాలకు సరుకులను సరఫరా చేయకపోవడంతో ఉన్న నిల్వలతో పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. లబ్ధిదారులు చౌక ధరల దుకాణాల ద్వారా కందిపప్పు అందుకోవడమే మరిచిపోయారు. గత ప్రభుత్వ హయాంలో 2023 జూన్ నుంచి డిసెంబరు వరకు దీన్ని సరఫరా చేయలేదు. పండగకు మాత్రం జనవరిలో పంపిణీ చేసింది. ఆ తర్వాత నుంచి కందిపప్పు ఇవ్వడం మానేసింది. మార్చి నుంచి జూన్ వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగడంతో దీని కొనుగోలు, పంపిణీ అంశాలను ప్రభుత్వం పక్కన పెట్టింది. జూన్‌లో కొత్తగా కొలువు దీరిన టిడిపి కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా రేషన్‌లో అన్ని సరుకులూ పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినా కార్యాచరణకు నోచుకోలేదు. గత నెలలో కందిపప్పు అందుతుందని లబ్ధిదారులు ఆశించినా ఇవ్వలేదు. సెప్టెంబర్‌లో వినాయక చవితి కావడంతో ప్రభుత్వం కందిపప్పు ఇస్తుందని ఆశించిన కార్డుదారులకు నిరాశే మిగిలింది. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ నెలకు సంబంధించి 1,48,43,671 కార్డుదారులకు చెందిన 4,31,81,370 మందికి సరుకులను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరందరికీ బియ్యం మాత్రమే అందనున్నాయి. జిల్లాల్లో ఉన్న నిల్వల మేరకు మాత్రమే పంచదార, రాగులు, గోధుమపిండి పంపిణీ జరగనుంది. బియ్యం మినహా ఇతర అన్ని సరుకులనూ గత ప్రభుత్వం ఎంపిక చేసిన సంస్థలు, కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. ప్రభుత్వం వాటి స్థానంలో కొత్త వాటిని ఎంపిక చేసి వాటి ద్వారా పంపిణీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

**రాయితీ డబ్బులు ఇవ్వని కేంద్రం!**

కందిపప్పుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాయితీ డబ్బులను ఇవ్వలేదని తెలుస్తోంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ అంశంపై గత నెలలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసినా ప్రయోజనం లేకపోయింది. రాష్ట్ర ప్రభుత్వమే తన నిధులతో కందిపప్పును సేకరించేందుకు టెండర్లను పిలిచినట్లు సమాచారం. అవి ఖరారు కాకపోవడమే సెప్టెంబర్‌లో కందిపప్పు పంపిణీ కాకపోవడానికి ప్రధాన కారణమనే చర్చ నడుస్తోంది.

**రైతు బజార్లలో నాసిరకం**

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాసిరకంగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు తగ్గిస్తున్నా అది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. మరోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. ఎండియు వాహనాల ద్వారా గతంలో రాయితీపై ప్రభుత్వం రూ.67కే కేజీ కందిపప్పు అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్లో దీని ధర క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200కు చేరింది.

## శిరస్సు వంచి క్షమాపణలు చెబుతున్నా

- శివాజీ విగ్రహం కూలడంపై ప్రధాని మోడీ

**ముంబయి :** పార్లమెంటు ఎన్నికలకు ముందు హడావుడిగా తాను ప్రారంభించిన 35 అడుగుల శివాజీ విగ్రహం కూలిపోవడంతో ప్రధాని మోడీ శుక్రవారం క్షమాపణ చెప్పారు. మహారాష్ట్రలో సింధ్‌దుర్గ్‌లోని మాల్వాన్ రాజ్‌కోట్ ఫోర్టు వద్ద విగ్రహాన్ని నెలకొల్పి పట్టుమని ఎనిమిది మాసాలు కూడా కాకముందే ఈనెల 26న కుప్పకూలింది. విగ్రహం నాసిరకంగా ఉండడం వల్లే కూలిందని, ఇందులో భారీఅవినీతి చోటుచేసుకుందని లోకం కోడై కూసింది. ఈ ఘటనపై మరట్వాడా ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడం, త్వరలోనే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రానుండడం బిజెపిలో గుబులు పుట్టించింది.

శుక్రవారం పాలగఢ్‌లో వధ్వాన్ పోర్టు, ఇతర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, 'నాకు, నా సహచరులకు, ప్రతీఒక్కరికీ శివాజీ మహారాజ్ కేవలం ఒక రాజు మాత్రమే కాదు. గౌరవనీయమైన వ్యక్తి. ఈ రోజు నా దేవుడి పాదాలకు శిరస్సు వంచి క్షమాపణలు చెబుతున్నానని' అన్నారు.



తాబేళ్లు తరలిస్తూ పట్టుబడ్డ వారితో అటవీ అధికారులు

# 278 తాబేళ్ల పట్టివేత

**ప్రజాశక్తి- మోతుగూడెం (అల్లూరి జిల్లా)**

గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న తాబేళ్లను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లక్కవరం అటవీ క్షేత్రం పరిధిలో అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. ఆ వివరాలను మోతుగూడెం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నానాజీ శుక్రవారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు... సుకుమామిడి నార్త్ బీట్‌లో గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో స్కార్పియో వాహనం వారికి తారసపడింది. అనుమానంతో తనిఖీలు చేయగా ఎనిమిది గోనె సంచుల్లో 278 తాబేళ్లు కనిపించాయి. వాటిలో అప్పటికే 33 తాబేళ్లు చనిపోయాయి. అల్లూరి జిల్లా చింతూరు మండలం పొల్లూరు గ్రామానికి చెందిన కార్తీక్ మండల్, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ సమీపంలోని జగన్నాథపురానికి చెందిన బలిన సాయి కృష్ణలను అదుపులోకి తీసుకున్నారు.

వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కేసు నమోదు చేశారు. అమలాపురం నుంచి ఒడిశా రాష్ట్రానికి ఈ తాబేళ్లను వారు తరలిస్తున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. వాహనాన్ని, తాబేళ్లు ఉన్న సంచులను సీజ్ చేసి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు.

# శ్రమే అన్నింటికీ మూలం

- ప్రముఖ సినీ కవి సుద్దాల అశోక్ తేజ

**ప్రజాశక్తి-విజయవాడ**

శ్రమే అన్నింటికీ మూలమని..శ్రమ వల్లే ఉత్పత్తి, సంపద వస్తుందని ప్రముఖ సినీ కవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. ప్రముఖ సినీ కవి, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రాసిన 'శ్రమకావ్యం' గానం కార్యక్రమం జాషువా సంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబివికె ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. జాషువా వేదిక అధ్యక్షులు సునీల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో ఇది తన 56వ శ్రమకావ్యమని అన్నారు. 56 అక్షరాల తెలుగు భాష దినోత్సవం, అదే సమయంలో తన 56వ గానం సంతోషంగా ఉందని తెలిపారు. చరిత్ర మొత్తం శ్రమతోనే నిండి ఉందన్నారు. పౌరాణిక ప్రతీకలను వాడుకొని ఈ గేయాన్ని రాశానని చెప్పారు. 'శ్రమ ప్రయాణమే శ్రమాయణం.. విష్ణువు పెట్టుకున్న కిరీటం కూడా శ్రమ జీవి తయారు చేసింది. శ్రముడు, శ్రమి కలిసి సాగిన ప్రస్థానం ఈ శ్రమ కావ్యం' అన్నారు. శారీరక శ్రమ నుండే నృత్యం, గానం పుట్టాయన్నారు. క్రైస్తవం, ముస్లిం, హిందూ మతాల కంటే ముందే ఏర్పడిన ఏకైక మతం శ్రామిక మతమన్నారు. రామాయణం, శివాయనం కన్నా ముందు నుండే శ్రమ ఉందని తెలిపారు. విశ్వరూపమే మహారూపం అయితే శ్రమ అంతకన్నా పెద్ద విశ్వరూపమని పేర్కొన్నారు. ఆది మానవుల నుండి మొదట పాట... ఆ తరువాతే మాట వచ్చిందన్నారు. సమాజ పురోగమనంలో శ్రమ విలువ వెలకట్టలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, ఎంబివికె బాధ్యులు కె.స్వరూపరాణి పాల్గొన్నారు. ముందుగా ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు జగన్, పిఎన్‌ఎమ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్, అనిఫ్, అప్పన్న, చంద్ర నాయక్ శ్రమ విలువ, గొప్పతనంపై గేయాలు ఆలపించారు.



శ్రమకావ్యం గానం కార్యక్రమంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

## ఏడుగురికి ఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఏడుగురు అడిషనల్ ఎస్‌పిలకు నాన్‌కేడర్ ఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ ఎస్‌పిలు ఎం కృష్ణమూర్తి నాయుడు, టి శోభా మంజరి, బి ప్రసాదరావు, పివిఆర్‌ఎస్‌ఎస్ వర్మ, పి సోమశేఖర్‌రావు, కెవిఆర్‌కె ప్రసాద్, ఎస్ రాజశేఖర్‌రావు, కె చక్రవర్తికి నాన్‌కేడర్ ఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి కల్పించారు.

**ఎఎస్‌పిలుగా 30 మందికి ఉద్యోగోన్నతి**

30 మంది డిఎస్‌పిలను అడిషనల్ ఎస్‌పిలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ విడుదల చేశారు. ఎన్ సురేంద్ర, పి నాగరాజరెడ్డి, వివి నాయుడు, జె రమేష్‌రెడ్డి, కె శ్రీనివాసులు, ఎ శ్రీనివాసులు, ఎం వెంకటాద్రి, ఎన్ యుగంధర్‌బాబు, జి హుస్సేన్‌పీరా, కె జనార్ధన్ నాయుడు, ఎం మోహన్‌రావు, ఎల్ నాగేశ్వరి, పి శ్రీనివాసరావు, కె విజయ్‌పాల్, ఎం రాజారావు, ఎల్ మోహన్‌రావు, ఎ త్రినాథరావు, ఎన్‌బిఎమ్ మురళీకృష్ణ, ఐ రామకృష్ణ, కె ప్రకాష్‌బాబు, కెఎస్ వినోద్‌కుమార్, వై మల్లేశ్వరరెడ్డి, జి వీరరాఘవరెడ్డి, వై శ్రీనివాసరెడ్డి, పి వీరాంజనేయరెడ్డి, ఎఎస్ చక్రవర్తి, కెవి రమణ, పి విజయ్‌కుమార్, కె ప్రభాకర్, కె రవి మనోహర ఆచారి, బి నాగభూషణ్‌రావు, వి గోపాలకృష్ణ, పి సౌమ్యలత, ఎం మహేంద్రకు అడిషనల్ ఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి లభించింది.

## క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డికి మున్సిపల్ ఫెడరేషన్ వినతి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

మున్సిపాలిటీలో చెత్త తరలించే క్లాప్ వాహనాల డ్రైవర్లకు రాష్ట్రవ్యాప్తంగా రూ.24,500 ప్రతినెలా ఐదో తేదీలోపు చెల్లించాలని, బకాయిలూ ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడికి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, కోశాధికారి జ్యోతిబసు తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఆరు నెలల నుండి ఎనిమిది నెలలుగా జీతాలు బకాయిలు పెట్టిన రెడ్జీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు పనిభారాన్ని తగ్గించాలని, వేధింపులు ఆపాలని, ఇపిఎఫ్, ఇఎస్‌ఐ సమస్యలు పరిష్కరించాలని కోరారు. చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గంధం చంద్రుడు మాట్లాడుతూ.. చట్టబద్ధమైన సౌకర్యాల కోసం మున్సిపల్ కమిషనర్లకు తగు సూచనలు ఇస్తామని, త్వరలో క్లాప్ డ్రైవర్ల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు సాల్మన్, సురేష్, శివన్న, పెద్దయ్య, ఇస్మాయిల్, రాజు, సుంకన్న, గోపి, అనిల్, అశోక్, బాబు, గణేష్ తదితరులు ఉన్నారు.

## జగన్ వెంటే ఉంటాం

- రాజ్యసభ సభ్యులు సుభాష్ చంద్రబోస్, అయోధ్య రామిరెడ్డి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వైసిపి ఆవిర్భావం నుండి తాము జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే వున్నామని, తాము పార్టీ మారుతున్నట్లు దుష్ప్రచారం చేయడం తగదని వైసిపి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. తాము మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వున్నపుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెన్నంటే వున్నామని, 2011 నుంచి జగన్ వెన్నంటే వుండాలని వైసిపిలో వున్నామని తెలిపారు. తమ వ్యక్తిత్వంపై బురద జల్లేలా పార్టీ మారుతున్నట్లు మాట్లాడుతున్నారని అన్నారు. తమ సహచర రాజ్యసభ సభ్యులైన మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబూరావు కూడా ఈ సమావేశానికి రావాల్సి వుందని, వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోతున్నామని, తాము కూడా జగన్ వెన్నంటే వుంటామని వారు తెలిపారని అన్నారు. వైసిపి మళ్లీ పుంజుకుంటుందన్నారు. మోపిదేవి వెంకట రమణ అంటే తమకు ఎంతో గౌరవమని, ఆయనకు జగన్ ఎంతో విలువ ఇచ్చారని, అయినా పార్టీని వీడటం తమను బాధించిందన్నారు. తమను కూడా పార్టీలోకి రమ్మని కొన్ని రాజకీయ పార్టీలు ఆహ్వానించాయని, వైసిపిలోనే వుంటామని వారికి తేల్చి చెప్పామని తెలిపారు.

## ఉచిత ఇసుక అమలుకు ప్రత్యేక కార్యాచరణ

- పట్టా భూముల నుంచి ఇసుక సేకరణకు త్వరలో జిఓ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కలెక్టర్లు ఉచిత ఇసుక పంపిణీ విషయంలో రోజువారీ సమీక్షలతో ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకోవాలని గనులు, ఆబ్కారీశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు.

ఉచిత ఇసుక విధానంపై శుక్రవారం కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్ తరహాలోనే జిల్లా స్థాయిలోనూ కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకావాల్సిన అవసరం లేదని, ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారని అన్నారు. పట్టా భూముల నుంచి ఇసుక సేకరణకు త్వరలోనే జిఓ ఇవ్వనున్నామని తెలిపారు. రవాణా ఛార్జీలు మినహాయించి రాష్ట్ర వ్యాప్తంగా ఏకీకృత ధర అమల్లో ఉండేలా ప్రయత్నిస్తున్నామన్నారు.

## స్త్రీ స్వీయ చరిత్రలు అవశ్యం

- గల్లా అరుణకుమారి పుస్తకావిష్కరణ సభలో వక్తలు

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

స్త్రీ స్వీయ చరిత్రలు రావల్సిన ఆవశ్యకత ఉందని, ఎక్కువగా స్వీయచరిత్రలు పురుషులే రాస్తారని, మహిళలవి చాలా తక్కువని, అటువంటి పుస్తకం మాజీ మంత్రి గల్లా అరుణకుమారి రచించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గల్లా అరుణకుమారి రచించిన వెయ్యి పేజీల నిడివిగల స్వీయచరిత్ర పుస్తకాన్ని తిరుపతి జిల్లా కరకంబాడిలోని అమరరాజా బ్యాటరీస్ ఆడిటోరియంలో ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన ప్రముఖ రచయిత్రి పోపూరి లలితకుమారి (ఓల్గా) శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓల్గా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక, రాజకీయ, సామాజిక చరిత్రను తెలియజేసేందుకు ఈ పుస్తకం ఒక ఆధారంగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ 33 మాత్రమే మహిళల స్వీయ చరిత్రలు వచ్చాయన్నారు. మహిళల రాజకీయ గమనం ఎలా ఉంటుంది, అందులో కష్టనష్టాలు, వ్యూహాలు, అధికార రాజకీయాల్లో స్త్రీల దృష్టి భావం అనే అంశాల నుంచి ఈ పుస్తకం వచ్చిందని వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో జరిగిన గందరగోళాన్ని, కెటిఆర్‌ను పోలీసులు కొట్టిన తీరు వీటన్నిటిని నిక్కచ్చిగా ఇందులో పొందిపరిచారని వెల్లడించారు. 1950 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఈ పుస్తకంలో స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. సభాధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ చక్కని జీవిత సూత్రాలతో గల్లా జీవితాన్ని నడిపారని, ఈ పుస్తకంలో ప్రతి పేజీలో ఆమె వెంట నిలిచిన జనం ఆదరాభిమానాలు కనిపిస్తాయన్నారు. గల్లా అరుణకుమారి కుమార్తె, ప్రముఖ వైద్యులు డాక్టరు గౌరనేని రమాదేవి మాట్లాడుతూ తన చిన్నతనంలో అమ్మ, తాతయ్యతో కలిసి తిరిగానని, వారి నిస్వార్థ సేవలను దగ్గరిగా చూశానన్నారు. వాటన్నిటిని ఆత్మకథగా రాయాలని అమ్మను ప్రేరిపించి, వాటిని అక్షర రూపంలో రాసేందుకు ప్రోత్సహించానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈనాడు పత్రిక సంపాదకులు ముక్కా నాగేశ్వరరావు, సాహితీవేత్త ఉమామహేశ్వరరావు, ఎమ్మెస్కో అధినేత చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


కాకినాడ డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

## స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి

- కాకినాడ డిసిఎల్ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల ధర్నా

**ప్రజాశక్తి - కాకినాడ రూరల్**

పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ డిసిఎల్ (డిప్యూటీ లేబర్ ఆఫీసర్) కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, చట్టాలను సక్రమంగా అమలు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు కాకినాడ రూరల్ కన్వీనర్ టి రాజా, ఐఎఫ్‌టియు నాయకులు భైరవ స్వామి, సివిల్ అండ్ మెకానికల్ యూనియన్ నాయకులు వీరభద్రరావు మాట్లాడారు. కాకినాడ రూరల్ మండలంలో ఉన్న పరిశ్రమలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు అమలు కావట్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పరిశ్రమలు నెలకొల్పే సమయంలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అది అమలు చేయట్లేదని అన్నారు. ఆయా ప్రాంతాలలో భూమి, విద్యుత్, మంచినీరు ఇతర సౌకర్యాలు, సబ్సిడీలు పొందుతున్న యాజ మాన్యాలు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి పని చేయించుకుంటున్నాయని అన్నారు. వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, సూర్రావుపేట, లైట్‌హౌస్, తమ్మవరం గ్రామాల్లో ఉన్న పరిశ్రమల్లో కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో డ్రిల్ మేక్ కంపెనీలో స్థానికులు ఉపాధి కల్పించకుండా యాజమాన్యం అన్యాయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ శ్రీహరి, డి సత్యనారాయణ, అంగడి శీను, వాసంశెట్టి సత్తిబాబు, సురేష్, ఎస్ రాంబాబు, నూకరాజు, రాజు, రామకృష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు రాఘవ, నాగేశ్వరరావు, రామకృష్ణ, ఎల్లారావు, రాజేష్, స్థానికులు నాగబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా జోరు వానలు

- నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు
- 45-55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు


పల్నాడు జిల్లా వినుకొండలో ప్రవహిస్తున్న వర్షపు, మురుగు నీరు

**ప్రజాశక్తి - యంత్రాంగం**

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. శనివారం, ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. తీరప్రాంతంలో 45 - 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు పడే అవకాశం ఉందని, ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాగల 36 గంటల్లో పశ్చిమ- వాయువ్య దిశగా ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల వైపు కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. లోతట్టు రహదారులు, కాలనీల్లో వర్షపు నీరు చేరింది. ఏలూరులో ఉదయం నుంచి జల్లులు పడుతూనే ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ముదినేపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు పడ్డాయి. వర్షం ప్రభావంతో కొనుగోళ్లు లేక దుకాణాలు వెలవెలబోయాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆళ్లగడ్డలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మహానంది పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారి మూడు కిలోమీటర్ల మేర గుంతలు, బురదతో నిండిపోయింది. బాపట్ల జిల్లాలో పలు చోట్ల భారీవర్షం కురిసింది. రేపల్లె మండలంలో అత్యధికంగా 40.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మాగాణి, మెట్ట సాగు పనులకు రైతులు సమాయత్తమవుతున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ముసురు వాతావరణం నెలకొంది. రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో కోతకు వచ్చిన పెసర, మినుము పంటలు దెబ్బతిన్నాయి. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి, పిఠాపురం, కాకినాడ, సామర్లకోట మండలాల్లో భారీ వర్షం పడింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తేలిక పాటి జల్లులు పడుతూనే ఉన్నాయి. కోనసీమ జిల్లా వ్యాప్తంగా తేలిక పాటి వర్షాలు పడ్డాయి.

## మొక్కలు నాటినట్లు చూపితే రాజీనామా చేస్తా

- వన మహోత్సవ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

అనకాపల్లి జిల్లాలో 60 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. టివిలు, పేపర్లల్లో ప్రకటనల కోసం మాట్లాడవద్దని అధికారులకు చురకులంటించారు. అనకాపల్లి పట్టణంలోని ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డులో జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ.. ఐదు నెలల్లో 60 లక్షల మొక్కలు నాటినందుకు అటవీశాఖ సిబ్బందిని అభినందించారు. అయ్యన్న మాట్లాడుతూ.. కలెక్టర్ మాటలను ఉటంకిస్తూ మొక్కల విషయమై సోషల్ ఆడిట్ నిర్వహిస్తే అటవీశాఖ అధికారుల పనితీరు తెలుస్తుందన్నారు. నర్సరీలు ఎన్ని వున్నాయి ? ఆ మొక్కలు ఎక్కడ పెంచారు ? ఎక్కడ నాటారు ? అనేది రికార్డు వుందా? అని ప్రశ్నించారు. పేపర్లు, టివిల కోసం మాట్లాడవద్దని, వాస్తవాలు మాట్లాడాలని అన్నారు. 60 లక్షల మొక్కలు ఉన్నాయని రుజువైతే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. పాఠశాలల్లో ఎన్‌సిసి, రెడ్‌క్రాస్ సేవలను పునరుద్ధరించాలని సూచించారు. గతంలో మొక్కల పెంపకంలో విద్యార్థుల భాగస్వామ్యం ఉండేదని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి, యలమంచిలి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, డిఎఫ్‌ఒ జగన్నాథ్ సింగ్, సామాజిక అటవీ విభాగం డిఎఫ్‌ఒ జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మరో 104 మందికి అస్వస్థత

- నూజివీడు ట్రిపుల్ ఐటి మెస్ నిర్వహణ తీరుపై జెసి ఆగ్రహం
- భోజనం, సరుకుల విషయంలో విద్యార్థులకూ భాగస్వామ్యం

**ప్రజాశక్తి - నూజివీడుటౌన్**

ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటి అధికారులు, మెస్‌ల నిర్వాహకుల తీరు మారకపోవడంతో విద్యార్థుల అస్వస్థత కొనసాగుతూనే ఉంది. శుక్రవారం మరో 104 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వగా వారిలో 102 మంది ఓపిలో చికిత్స పొందారు. మరో ఇద్దరు డయేరియా బారిన పడి కళాశాల ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరారు. దీంతో గత వారం రోజులుగా అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటింది.

మెస్‌ల నిర్వహణ తీరుపై ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆమె నూజివీడు ఆర్‌డిఒ వై.భవాని శంకరితో కలసి కళాశాలలోని పరిస్థితులను శుక్రవారం పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలో చికిత్స పొందుతున్న, పొందిన విద్యార్థుల నుంచి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెస్‌ల నిర్వహణ అధ్వానంగా, అపరిశుభ్రంగా ఉండడంతో జాయింట్ కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత దారుణంగా మెస్‌లను నిర్వహిస్తే విద్యార్థుల ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందని ప్రశ్నించారు. అపరిశుభ్రంగా మెస్‌లు నిర్వహిస్తున్న నిర్వాహకులపై తీసుకున్న చర్యలు ఏమిటని ట్రిపుల్ ఐటి పరిపాలనాధికారిని ప్రశ్నించారు. మెస్ నిర్వాహకులు తప్పు చేస్తే జరిమానా విధిస్తున్నామంటూ అధికారులు చెప్పగా ఆ జరిమానాలతో తమకు ఒరిగిందేమిటని విద్యార్థులు సూటిగా ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకుని మెస్ నిర్వాహకులపై వేసిన ఫైన్ సొమ్ముతో ఏం చేస్తున్నారని ప్రశ్నించగా అధికారులు నీళ్లు నమిలారు. దీంతో మెస్ నిర్వాహకులు, విద్యార్థులతో జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

**మెస్‌ల సక్రమ నిర్వహణకు ప్రణాళిక**

మెస్‌ల నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. శుక్రవారం రాత్రి మీడియాతో ఆమె మాట్లాడుతూ.. మెస్‌లో తయారయ్యే ఆహారం, సరుకుల విషయంలో విద్యార్థులకు విధులు ఏర్పాటు చేసి భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం, కుళ్లిన పదార్థాలను గుర్తించామని, దీనిపై తగిన చర్యలు చేపడతామని అన్నారు. వైఫై కావాలని విద్యార్థులు కోరిన మీదట మరో వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు ప్రతి ఆదివారం నిపుణులచే కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందించి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని చెప్పారు. జెసి వెంట నూజివీడు ఆర్‌డిఒ వై.భవాని శంకరి ఉన్నారు.




జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

## జువ్వలదిన్నె హార్బర్‌ను ప్రారంభించిన మోడీ

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద ఏర్పాటు చేసిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ నుంచి ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కావలి నియోజకవర్గానికి మణిహారం లాంటి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. హార్బర్ నిర్మాణం ద్వారా సంవత్సరానికి 40 వేల టన్నుల మత్స్య సంపదను వెలికితీయవచ్చని తెలిపారు. మత్స్యకారులు చేపల వేట సాగించేందుకు ఇన్నాళ్లుగా పడుతున్న ఇబ్బందులు నేటితో ముగిశాయన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా స్థానికంగానే చేపల వేట సాగించవచ్చని తెలిపారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో రూ.288.8 కోట్ల వ్యయంతో 76.89 ఎకరాల్లో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాని మోడీ జాతికి అంకితం చేశారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ, జడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, జువ్వలదిన్నె సర్పంచ్ అంకమ్మ, బోగోలు జెడ్‌పిటిసి సులోచనమ్మ, వందలాది మత్స్యకారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

## ఎవరికీ ఇబ్బంది లేకుండా చేరికలు

- టిడిపి అధినేత చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వైసిపిలో ఇమడలేక చాలా మంది తమ పార్టీలోకి వచ్చేందుకు చూస్తున్నారని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తమ పార్టీలోని నేతలు, కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా చేర్చుకుంటామని చెప్పారు. మంచి వ్యక్తిత్వం ఉన్నవారినే చూసి తీసుకుంటామన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా చర్చించారు. ముంబయి నటి వ్యవహారంలో అప్పటి పోలీసులు వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రతిష్టను మంటగలిపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన పోలీసులు ఏ స్థాయిలో ఉన్నా క్షమించేది లేదని వెల్లడించారు. గుడ్లవల్లేరు కళాశాలలో జరిగిన ప్రచారం పట్ల అంతా భయాందోళనకు గురయ్యారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని వెల్లడించారు. అంతకముందు గ్రీవెన్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యల పరిష్కారానికి చంద్రబాబు హామీ ఇచ్చారు. పలువురికి ఆర్థికసాయం చేశారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.1 లక్ష విరాళంగా అందించిన గొల్లపూడికి చెందిన కొల్లా వెంకట్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. మీ సేవా కేంద్రాలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని మీ సేవా ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చంద్రబాబును కోరారు. ప్రత్యక్షంగా 10,500 మంది, పరోక్షంగా 5 వేల కుటుంబాలకు ఉపాధి కలిగించే ఈ కేంద్రాలను గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలిపారు.



భీమిలిలోని కెజిబివి విద్యార్థినులతో ముచ్చటిస్తున్న మంత్రి నారా లోకేష్

## ప్రతి పాఠశాల అభివృద్ధే ధ్యేయం

- మంత్రి లోకేష్

**ప్రజాశక్తి - మధురవాడ, భీమునిపట్నం (విశాఖపట్నం)**

రాష్ట్రంలో ఉన్న ప్రతి పాఠశాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖలోని చంద్రంపాలెం ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోనే చంద్రంపాలెం పాఠశాల అతి పెద్దదని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఐఐటి వంటి ప్రముఖ విద్యా సంస్థల్లో సీట్లు పొందారని గుర్తు చేస్తూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలను ఈ సందర్భంగా పరిశీలించారు. ఓ విద్యార్థినిని పాఠ్యపుస్తకాన్ని చూసి ఓ పేరా చదవాలని కోరారు. ఆ పేరాలో ఏం అర్థముందో చెప్పాలన్నారు. తెలుగులో చదివేందుకు తాను పడ్డ ఇబ్బందులను లోకేష్ విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు. పాఠశాలలోని సమస్యలను మంత్రి గుర్తించి పరిష్కరిస్తామని తెలిపారు. మరుగుదొడ్లకు సరైన డోర్లు లేవనే విషయాన్ని విద్యార్థినులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జివిఎంసి మూడో వార్డు పరిధిలోని గొల్లలపాలెంలో ఉన్న కెజిబివిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అందరి సహకారంతో రాష్ట్రంలోని పాఠశాలలను దేశానికి ఆదర్శంగా నిలుపనున్నామన్నారు. ఆయన వెంట విశాఖ ఎంపి శ్రీభరత్, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉన్నారు.

## జిఎడి స్పెషల్ సిఎస్‌గా రజత్ భార్గవ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సాధారణ పరిపాలనాశాఖ (జిఎడి) స్పెషల్ సిఎస్‌గా రజత్ భార్గవ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 1500ను శుక్రవారం విడుదల చేసింది. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోలా భాస్కర్‌ను రిలీవ్ చేసింది. చీఫ్ కమిషనరు ఆఫ్ ట్యాక్సెస్‌గా పనిచేస్తున్న ఎం గిరిజా శంకర్ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనుండడంతో ఆయన స్థానంలో ముఖేష్‌కుమార్ మీనాకు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

## కలుషిత ఆహారం తిని విద్యార్థినులకు అస్వస్థత

**ప్రజాశక్తి-అరకు లోయ**

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం జాముగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలోని వసతి గృహంలో కలుషిత ఆహారం తిని 50 మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో 43 మంది అరకులోయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలో భోజనం తిన్న కొద్దిసేపటికే విద్యార్థినులు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. వెంటనే హాస్టల్ సిబ్బంది అరకులోయ ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొంతమంది పరిస్థితి తీవ్ర విషమంగా ఉందని సమాచారం. అయితే, ఇప్పటి వరకు ఏ అధికారి కూడా ఆస్పత్రికి చేరుకోకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంబారు, రసం ఉడికించిన కూరలు తినడం వల్లే ఈ ఘటనకు కారణమని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఆనంకు ఆహ్వానం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో వరసిద్ధి వినాయక పర్వ దర్శకర్తలు సచివాలయంలో శుక్రవారం భేటీ అయ్యారు. ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వారికి మంత్రి వివరించారు. అలాగే కాణిపాకం వరసిద్ధి వినాయక బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 7 నుంచి 27 వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించి నాలుగు భాషల్లో ముద్రించిన పోస్టరును మంత్రి సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనరు ఎస్ సత్యనారాయణ, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, అదనపు కమిషనరు రామచంద్రమోహన్, కాణిపాకం ఆలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వాణి పాల్గొన్నారు.

## రియల్‌మీ 13 సిరీస్ 5జి విడుదల

**న్యూఢిల్లీ :** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీదారు రియల్‌మీ భారత్‌లో కొత్తగా రియల్‌మీ 13 సిరీస్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. 5జితో మద్దతుతో దీన్ని అందిస్తున్నది. 6.67 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో ఆవిష్కరించింది. 50ఎంపి సోనీ ఎల్‌వైటి600 మెయిన్ కెమెరా, 2ఎంపి మోకోక్రోమ్ సెన్సార్, 16ఎంపి సెల్ఫీ కెమెరా ఫీచర్లుగా ఉంది. రియల్‌మీ13 ప్లస్5జి ప్రారంభ వేరియంట్ 8జిబి, 128జిబి ధరను రూ.17,999గా ప్రకటించింది. ప్రస్తుతం ప్రీబుకింగ్స్ తెరిచినట్లు.. సెప్టెంబర్ 6 నుంచి డెలివరీలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది.



విశాఖ జిల్లా పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



అనంతపురం డిఇఒ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

# ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను అంగీకరించం

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ఆందోళన

**ప్రజాశక్తి-యంత్రాంగం**

ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం తహశీల్దార్, డిఇఒ కార్యాలయాల వద్ద నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ ఆందోళనలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఓపిఎస్ తప్ప మరే పెన్షన్ పథకాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాల్సిన కేంద్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకుండా యుపిఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్) పేరుతో మరో పథకం తీసుకురావడాన్ని ఖండించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

విశాఖ జిల్లా భీమిలిలో ఉపాధ్యాయులు ప్లకార్డులు చేబూని పాత బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిటి శ్రీనుబాబుకు వినతిపత్రం అందజేశారు. డైట్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా పెందుర్తి, పాడేరు, అరకులోయ, చింతూరు మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని యుటిఎఫ్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. నరసాపురం, తణుకుల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. ఏలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గుంటూరు తాలూకా కేంద్రంలో జరిగిన నిరసన ప్రదర్శనలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ ఉద్యోగులు కంట్రిబ్యూషన్ చెల్లించే ఏ పెన్షన్ స్కీమునూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మంగళగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆందోళన నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలోని తాలూకా కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. తిరుపతి జిల్లా తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తిలో ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, పుంగనూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు చేపట్టారు. కడప జిల్లా బద్వేలు, అన్నమయ్య జిల్లా రాయచోటి, మదనపల్లెలో ఎంఇఒ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద, పార్వతీపురంలోని డిఇఒ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు.

## సచివాలయ ఉద్యోగులకు అంతర్ జిల్లాల బదిలీలు కల్పించాలి

- గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించడంతోపాటు బదిలీల నుంచి మినహాయించిన ఆరు విభాగాల కార్యదర్శులకు కూడా ప్రస్తుత బదిలీల్లో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు ఎమ్‌డి జానీ పాషా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబరు 2 నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తవుతున్న నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరికీ సాధారణ బదిలీలకు అవకాశం కల్పించి ఉపాధ్యాయ బదిలీల విధానం ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఆయన కోరారు.

## మార్గదర్శిపై కేసుల ఉపసంహరణ తగదు : అంబటి రాంబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో:** రామోజీరావుకు మరణం తర్వాత క్లీన్‌చిట్ ఇవ్వడానికి సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. అందులో భాగంగానే బలమైన ఆధారాలు వున్నా.. మార్గదర్శిపై పెట్టిన కేసులను సిఐడి ఉపసంహరించుకుందని తెలిపారు. ఇది కచ్చితంగా చంద్రబాబు క్విడ్ ప్రో అని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రామోజీరావు వ్యాపారాలన్నీ చట్ట వ్యతిరేకమైనవేనని ఆరోపించారు. మార్గదర్శిలో అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తే జగన్ వ్యక్తిగతంగా కక్ష కట్టారని కట్టుకథలు అల్లారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శిని నడుపుతూ.. అందులోని ప్రజల డబ్బును ఇతర సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెట్టారని అన్నారు. మార్గదర్శి అక్రమాలపై విచారణ జరుగుతుండగానే క్లీన్‌చిట్ ఇవ్వడం తగదన్నారు. మార్గదర్శి అవకతవకలను ఆర్‌బిఐ కూడా గుర్తించిందన్నారు. ఎంత మంది నాయకులు వెళ్లినా వైసిపికి నష్టం లేదని అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డిపై బురద జల్లేందుకు కాదంబరి జెత్వానిని ముందుకు తెచ్చారని, త్వరలోనే వాస్తవాలు ప్రజల ముందుకు వస్తాయని అన్నారు.

## పథకాల అమలు పర్యవేక్షణకు జిల్లాలకు సీనియర్ ఐఎఎస్‌లు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

జిల్లాల్లో ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సీనియర్ ఐఎఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత హెచ్‌ఒడిలు, ఆయా జిల్లాల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని అందులో పేర్కొన్నారు.

**జిల్లాల వారీ నియమితులైన ఐఎఎస్‌లు**

జయలక్ష్మి (ఎన్‌టిఆర్), శశిభూషణ్ కుమార్ (ఏలూరు), కాంతిలాల్ దండే (అనంతపురం) సౌరబ్‌గౌర్ (విశాఖ), కోన శశిధర్ (పార్వతీపురం మన్యం), బాబు ఎ (పశ్చిమగోదావరి), యువరాజ్ (సత్యసాయి), ఎంఎం నాయక్ (చిత్తూరు), హర్షవర్ధన్ (కర్నూలు), పోలా భాస్కర్ (నంద్యాల), ప్రవీణ్‌కుమార్ (శ్రీకాకుళం) ఎంవి శేషగిరిబాబు (బాపట్ల), కన్నబాబు (అల్లూరి సీతారామరాజు), సత్యనారాయణ (తిరుపతి), వినయ్‌చంద్ (విజయనగరం), సూర్యకుమారి (అన్నమయ్య), రేఖారాణి (పల్నాడు), వీరపాండియన్ (కాకినాడ), హరికిరణ్ (నెల్లూరు) చెరుకూరి శ్రీధర్ (అనకాపల్లి), గంధం చంద్రుడు (ప్రకాశం), కెవిఎన్ చక్రధర్‌బాబు (కడప), హరి నారాయణ (తూర్పుగోదావరి), లత్కర్ శ్రీకేష్ బాలాజీరావు (అంబేద్కర్ కోనసీమ), విజయారామరాజు (కృష్ణా), మల్లికార్జున (గుంటూరు)ను ప్రత్యేకాధికారులుగా జిల్లాలకు నియమించింది.





# గ్రామీణ పేదలను సంఘటితం చేద్దాం

- 15 నుంచి 30 వరకు దేశవ్యాప్త క్యాంపెయిన్
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్



విస్తృత సమావేశాల్లో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

గ్రామీణ పేదలందరినీ సమీకరించి సమరశీల ఉద్యమాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పిలుపునిచ్చారు. ఆ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం రెండోరోజైన శుక్రవారం ప్రకాశం జిల్లా ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో కొనసాగింది. వెంకట్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో అనేక కొత్త మార్పులు వస్తున్నాయని, ఫ్యూడల్ వ్యవసాయం నుంచి కార్పొరేట్ వ్యవసాయం దిశగా మారుతోందన్నారు. వీటిని అధ్యయనం చేసి అందులో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు సామాజిక బాధ్యతలను విస్మరించడంతో విద్య, వైద్యం, మౌలిక వసతులు పేదలకు దూరం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార భద్రత కరువైందని, ప్రజా పంపిణీ వ్యవస్థను పాలకులు ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగ పరిరక్షణ జరిగితేనే ఆహార భద్రత లభిస్తుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని పాలకులు ప్రయివేట్ పరం చేస్తుండటంతో దళితులు, అణగారిన వర్గాలు, వ్యవసాయ కార్మిక కుటుంబాలకు విద్య, ఉపాధి లేకుండా పోతోందని వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అత్యంత అవసరమన్నారు. సామాజిక న్యాయానికి సమాధి కడుతున్న బిజెపి మతోన్మాద భావజాలాన్ని ప్రతిఘటించాలని, లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు విశాల ఐక్యవేదికలను ఏర్పాటు చేయాలని కోరారు. సమాజంలో అణగారిన వర్గాలైన దళితుల సమస్యలు ఏజెండా చేసేందుకు సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు దేశవ్యాప్త క్యాంపెయిన్ చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పాల్గొని ప్రసంగించారు. 26 జిల్లాలకు చెందిన ప్రతినిధులు చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకున్నారు. రాష్ట్ర విస్తృత సమావేశాల నిర్వహణకు సహకరించిన వారందరికీ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

# చేనేత కార్మికులపై నోరు పారేసుకున్న మంత్రి సవిత

- చేనేత కార్మిక సంఘం ఆక్షేపణ

**ప్రజాశక్తి మంగళగిరి (గుంటూరు జిల్లా)**

చేనేత కార్మికులను కించపరుస్తూ మంత్రి సవిత వ్యంగ్యంగా మాట్లాడడం తగదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సవిత ఛాంబర్లో గురువారం ఆమెను కలిసి అడిగామన్నారు. దీనిపై పెన్షన్ ఇస్తున్నామని, నేతన్న నేస్తం పథకం అమలు చేయడం లేదని మంత్రి చెప్పారన్నారు. అలాగే ఈ పథకం ద్వారా డబ్బులు ఇస్తే చేనేత కార్మికులు మద్యం సేవించడానికా అంటూ వ్యంగ్యంగా మాట్లాడారని, ఇలా మాట్లాడడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తెలుగు నాడు చేనేత కార్మిక సంఘం నాయకులు ప్రతి చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుస్తున్నారని విమర్శించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొతవరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదరణ పథకంలో ఇచ్చే పరికరాలు ఉపయోగపడడం లేదని, చేనేత కార్మికులకు ఉపయోగపడే విధంగా పరికరాలు ఇవ్వాలని కోరారు.



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

## ఆర్థిక ఇబ్బందుల్లో స్పైస్‌జెట్..!

**న్యూఢిల్లీ :** చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి జారుకుంది. కొంతమంది క్యాబిన్ క్రూ సిబ్బందిని మూడు నెలల పాటు సెలవులపై పంపాలని నిర్ణయించుకుంది. ఈ కాలంలో వారికి ఎలాంటి జీతాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన వచ్చిందని స్పైస్‌జెట్ ప్రతినిధి పేర్కొన్నారు. 150 మంది క్యాబిన్ సిబ్బందిని తాత్కాలికంగా మూడు నెలల పాటు సెలవులో వెళ్లాలని కోరినట్లు తెలిపారు. ప్రయాణికుల నుంచి డిమాండ్ లేమి, విమానాల సంఖ్య తగ్గడం తదితర కారణాలతో పాటు సంస్థ దీర్ఘకాలిక స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

## కోటి పాలసీల జారీ లక్ష్యం

- తెలుగు రాష్ట్రాల్లో రెట్టింపు వ్యాపారం : పిబి పార్ట్‌నర్స్

**హైదరాబాద్ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో కోటి పాలసీలు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ బ్రాండ్ పిబి పార్ట్‌నర్స్ మోటార్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ అభిమన్యు శర్మ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన ఆ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ అమిత్ భడోరియాతో కలిసి మీడియాతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో 65 లక్షల పాలసీలను విక్రయించామన్నారు. తమకు దేశంలో 1.3 కోట్ల బిజినెస్ పార్ట్‌నర్లు ఉన్నారన్నారు. 2027-28 నాటికి వైజాగ్, తిరుపతి, కోయంబత్తూర్ నగరాలతో సహా దక్షిణ భారతదేశంలో దాదాపు 17-18 కార్యాలయాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్‌లో 25 మంది ఉద్యోగులతో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సంపాదకీయం


# తిండి కలిగితె..

'తిండి కలిగితె కండ కలదోయ్– కండగలవాడేను మనిషోయ్' అన్నాడు మహాకవి గురజాడ. ప్రతిష్టాత్మకమైన నూజివీడు ట్రిపుల్ ఐటిలో గడచిన ఐదారు రోజుల్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులు నాసిరకం ఆహారం, పరిసరాల అపరిశుభ్రత మూలంగా అస్వస్థతకు గురికావడం తీవ్ర ఆందోళనకరం. జ్వరాలు విజృంభించడం, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో బాధపడుతూ కళాశాల ఆవరణలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాగునీరు, కలుషిత ఆహారంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మంగళవారమే ప్రకటించారు. రెండు రోజుల తరువాత కూడా పరిస్థితి అదుపులోకి రాకపోగా మరింతమంది విద్యార్థులు అస్వస్థులు కావడంతో ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలో అధికారుల బృందం గురువారం సందర్శించి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, వంట చేసే ప్రాంతాల్లో పరిశుభ్రతను పరిశీలించింది. ఈ బృందం పరిశీలన కొనసాగిస్తున్న సమయంలోనే తెల్లని పురుగులు భోజనం పళ్లాల్లో విహరించాయంటే ట్రిపుల్ ఐటిలో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో స్పష్టమవుతోంది. ఆ పొరుగునే కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం తెల్లవారుజామున విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో బాధపడగా వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం మధ్యాహ్నం భోజనంలో క్యారెట్, పచ్చి శనగపప్పుతో కలిపిన కూర, సాయంత్రం పచ్చి శనగపప్పు, క్యాబేజీతో కలిపిన కూరను వడ్డించినట్టు బాధిత విద్యార్థినులు తెలిపారు.

ఇవి కేవలం రెండు విద్యాసంస్థల్లో ఈవారం ప్రముఖంగా చోటుచేసుకున్న ఘటనలు. ఇలాంటివి ఎన్ని వున్నాయో, అసలు వెలుగు చూడనివి ఇంకెన్నో ఎవరికీ తెలియదు. ప్రభుత్వ విద్యాలయాల్లో అనేకచోట్ల నాణ్యతలేని ఆహారం అందించడంతోపాటు అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయన్నది కాదనలేని వాస్తవం. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం అర్ధరాత్రి వరకూ సమీక్షించి మెస్‌లో ఆహార నాణ్యతను పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశించినా ఆయన వెళ్లిన తెల్లారే గురువారం ఉదయం ఉడకని కోడిగుడ్లు, ఉప్మా అల్పాహారంగా విద్యార్థులకు పెట్టడం గమనార్హం. మధ్యాహ్నం బెండకాయ కూర, అన్నంలో పురుగులు రావడంతో తినలేక మళ్లీ చెత్త కుండీల్లో పడేశారు. ప్రతిష్టాత్మకమైన నూజివీడు ట్రిపుల్ ఐటిలో అనారోగ్యానికి గురైన విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మరో మంత్రి కొలుసు పార్థసారథి వేర్వేరుగా ఆదేశాలు జారీ చేశాక కూడా రెండు రోజుల వరకూ పరిస్థితి సాధారణ స్థితికి రాకపోవడం అధికారుల నిర్లక్ష్యం ఎంతలా ఉందో తేటతెల్లం చేస్తోంది.

ఈ నెలలోనే అనకాపల్లి జిల్లాలో ఓ అనాథాశ్రమంలోని పిల్లలు విషతుల్యమైన ఆహారం తిని మరణించిన ఘటన కలచివేస్తున్న సమయంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసువడంతో ఎవరికైనా కడుపు తరుక్కుపోతుంది. ఇంకొందరికి ఆగ్రహావేశాలూ కలుగుతాయి. రాష్ట్రంలోని విద్యా సంస్థలన్నిటా పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడడం ప్రభుత్వ బాధ్యత. అందునా తన ఆధీనంలోని విద్యాలయాల్లో మరింత జాగ్రత్తగా వుండాలి. అలాగే రక్షిత మంచినీరు అందించడం, పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలి. అంతేగాక జ్వరాలు, ఇతర అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యా సంస్థలన్నిటిలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించడం తదితర చర్యలనూ సర్కారు చేపట్టాలి. నేటి బాలలే రేపటి పౌరులని సూక్తులు చెప్పడంతోపాటు పాలకులు విద్యాలయాల్లో పరిస్థితులను చక్కదిద్దడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఆ దిశగా అధికార యంత్రాంగాన్ని నడిపించాలి. వారిలో జవాబుదారీతనాన్ని పెంచాలి. అటువంటి స్థితి నెలకొన్ననాడే ప్రభుత్వ విద్యాసంస్థలకు బిడ్డలను పంపించే తల్లిదండ్రులు వారి గుండెలపై చెయ్యి వేసుకొని ప్రశాంతంగా ఉండగలరు. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలి.

మహనీయుల మాట



ఏ విషయాన్నయినా నిగ్రహం కోల్పోకుండా వినగలిగే సామర్థ్యాన్ని విద్య ప్రసాదిస్తుంది.

**- రాబర్ట్ ఫ్రాస్ట్,**
అమెరికన్ కవి.

# ప్రజాస్వామ్యం అంటే ఏంటో మోడీకి అర్థమైంది

విశ్లేషణ


పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రధాని మోడీ, బిజెపి ఆశలను వమ్ము చేశాయి. అయితే, ఫలితం వెలువడిన కొద్ది గంటల్లోనే 'ఎన్‌డిఎకు చారిత్రాత్మక మూడో మలుపు' అన్న మోడీ ప్రకటన వెలువడింది. 2019లో తనకున్న 303 సీట్ల నుంచి 63 స్థానాలు కోల్పోయిన బిజెపి 240 సీట్లకు పరిమితమైంది. అయితే ప్రభుత్వానికి మునుపటిలాగే బలముందని, తీర్పును అంగీకరించడానికి సిద్ధంగా లేదని మోడీ స్పష్టం చేశారు. తన నేతృత్వంలోని మూడో సంకీర్ణ ప్రభుత్వం...2014, 2019లో మాదిరిగానే పని చేస్తుందని తొలి నాళ్లలో మోడీ ముద్ర వేశారు. ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మెహతాబ్ నియామకం, స్పీకర్‌గా ఓం బిర్లా రెండోసారి నియామకం, గత మంత్రివర్గంలో హోం, రక్షణ, ఆర్థిక, విదేశాంగ మంత్రులుగా పనిచేసిన వారిని తిరిగి అవే శాఖల్లో కొనసాగించడం, అజిత్ దోవల్‌కు రెండో పర్యాయం జాతీయ భద్రతా సలహాదారుగా నియమించడం ద్వారా...మొదటి, రెండవ మోడీ ప్రభుత్వాలకు మూడవ ప్రభుత్వానికి రూపంలో కానీ సారంలో కానీ ఎలాంటి తేడా వుండదని చెప్పడమే.

కానీ మోడీ 3.0 ప్రభుత్వం ఏర్పడ్డాక 100 రోజులు కూడా గడవక ముందే ఒక వాస్తవాన్ని అంగీకరించవలసి వచ్చింది. అత్యధిక స్థానాలు పొందడంతో ఏర్పడిన మోడీ మొదటి, రెండవ ప్రభుత్వాలు... మోడీ నేతృత్వంలోని మూడవ సంకీర్ణ ప్రభుత్వం రూపం, సారంలో భిన్నంగా ఉంటుందని అంగీకరించవలసి వచ్చింది. బిజెపికి సొంతంగా మెజారిటీ లేకపోవడంతో టిడిపి, జెడియు కీలక మద్దతుతో ప్రభుత్వం నడుస్తోంది. మరే సంకీర్ణ ప్రభుత్వం ఎదుర్కోని బలమైన ప్రతిపక్షాన్ని ఈ సారి మోడీ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రజలు బలమైన ప్రతిపక్షానికి అనుకూలంగా ఓటు వేశారు.



**ఎం.వి. గోవిందన్**

అత్యధిక స్థానాలు కలిగిన పార్టీగా మోడీ, అమిత్ షా లు పదేళ్లలో తీసుకున్న నిర్ణయాలను అదే రీతిలో అమలు చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని తొలగించడమే కాకుండా, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదింపచేసుకొన్నారు. అనేక సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నీరుగార్చేలా నాలుగు కోడ్‌లు ఆమోదింపచేసుకున్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే మూడు బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే తీసుకొచ్చుకున్నారు. అయితే ఏడాది పైగా జరిగిన చారిత్రాత్మక రైతాంగ పోరాటం తర్వాత వాటిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. మోడీ 3.0 ప్రభుత్వం స్వతంత్రంగా ప్రభుత్వాన్ని ఏర్పరచలేకపోవడానికి, మెజారిటీ కోల్పోవడానికి రైతుల ఆగ్రహమే ప్రధాన కారణం.




**అత్యధిక స్థానాలు కలిగిన పార్టీగా మోడీ, అమిత్ షా లు పదేళ్లలో తీసుకున్న నిర్ణయాలను అదే రీతిలో అమలు చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని తొలగించడమే కాకుండా, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదింపచేసుకొన్నారు. అనేక సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నీరుగార్చేలా నాలుగు కోడ్‌లు ఆమోదింపచేసుకున్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే మూడు బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే తీసుకొచ్చుకున్నారు. అయితే ఏడాది పైగా జరిగిన చారిత్రాత్మక రైతాంగ పోరాటం తర్వాత వాటిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. మోడీ 3.0 ప్రభుత్వం స్వతంత్రంగా ప్రభుత్వాన్ని ఏర్పరచలేకపోవడానికి, మెజారిటీ కోల్పోవడానికి రైతుల ఆగ్రహమే ప్రధాన కారణం.**

ఏది ఏమైనా మోడీ 3.0 ప్రభుత్వం తన ఒక్కో నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవలసి వస్తున్నది. వెనక్కి తీసుకోవలసి వచ్చిన వాటిలో మూడు కీలక నిర్ణయాలున్నాయి. 45 మందిని లేటరల్ ఎంట్రీ ద్వారా తీసుకోవాలనే నిర్ణయాన్ని మూడు రోజుల్లోనే విరమించుకున్నారు. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల తర్వాత వక్ఫ్ సవరణ చట్టం ఆమోదాన్ని పొందడంలో విఫలమైంది. బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాల్సి వచ్చింది. యూట్యూబ్ న్యూస్ ఛానెళ్లు, యాంకర్లను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ప్రసార సేవల (నియంత్రణ) బిల్లు ఆమోదంలో జాప్యం జరిగింది.

ఆగస్టు 17న ప్రముఖ వార్తాపత్రికల్లో లేటరల్ ఎంట్రీ ప్రకటన కనిపించింది. 24 మంత్రిత్వ శాఖల్లో 45 పోస్టులకు ప్రత్యక్ష నియామకం అంటూ ప్రకటన వెలువడింది. వాటిలో జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ పోస్టుల నియామకాలున్నాయి. వివిధ రంగాల్లో ప్రతిభావంతుల సేవలను వినియోగించుకోవడమే లేటరల్ ఎంట్రీ వెనుక లక్ష్యం అన్న వివరణ వెలువడింది. అలాంటప్పుడు వారిని సలహాదారులుగానో, మరో విధంగానో నియమిస్తే సరిపోతుందా అన్న ప్రశ్న వెలువడింది. ప్రత్యక్ష నియామకం అంటే రిజర్వేషన్‌ను తొలగించడమే కదా అనే అంశాన్ని ప్రతిపక్షాలు ప్రధానంగా లేవనెత్తాయి. లేటరల్ ఎంట్రీ కారణంగా పదోన్నతి ద్వారా ఈ పోస్టులకు చేరే అవకాశం తగ్గడమేగాక, రిజర్వేషన్ అవకాశం కూడా కనుమరుగవుతుంది. ఆర్.ఎస్.ఎస్, బిజెపిలు రిజర్వేషన్‌ను సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తున్నాయి. దీన్ని అమలు చేయడానికి వేసిన పెద్ద ప్రణాళికలో భాగమే ఇదంతా.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆర్.ఎస్.ఎస్ కార్యకలాపాలలో పాల్గొనడంపై 58 ఏళ్లుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిన కొద్ది రోజులకే లేటరల్ ఎంట్రీ రిక్రూట్‌మెంట్ ప్రకటన వెలువడింది. అంటే రెండు కేటగిరీల అభ్యర్థులు ప్రధానంగా లేటరల్ ఎంట్రీ ద్వారా రిక్రూట్ చేయబడతారు. ఒకటి ఆర్‌ఎస్‌ఎస్, రెండోది కార్పొరేట్ ప్రతినిధులు. బ్యూరోక్రసీని నేరపూరితం చేయడంతోపాటు కార్పొరేటీకరించడం కూడా వారి లక్ష్యమని అర్థమవుతోంది. ఈ లేటరల్ రిక్రూట్‌మెంట్ ఆలోచన సివిల్ సర్వీస్ అభ్యర్థుల కలలను ఛిన్నాభిన్నం చేసింది. దాంతో సహజంగానే పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ఎన్డీయే మిత్రపక్షాలైన జె.డి.యు, ఎల్.జె.పి సైతం నిరసించడంతో మరో గత్యంతరం లేక మోడీ ప్రభుత్వం మూడో రోజున ఈ చర్యను విరమించుకోవలసి వచ్చింది.

వక్ఫ్ బోర్డు విషయంలోనూ ప్రభుత్వం అవమానకరమైన రీతిలో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. వక్ఫ్ ఆస్తులను ఆక్రమించేందుకు వక్ఫ్ చట్టాన్ని సవరించి, తద్వారా మతతత్వ రాజకీయాలకు మరింత పదును పెట్టాలని చూసింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చింది. ప్రజా ప్రతినిధులు మొదలైనవారు ముస్లింలే ఉండాలనే నిబంధనను తొలగించింది. దేవాలయాలు హిందువులకే అని నినాదాలు చేసేవారు వక్ఫ్ బోర్డులను ముస్లిమేతరులతో నింపే ప్రయత్నం చేస్తున్నారు. మరో మాటలో చెప్పాలంటే, కొత్త సవరణ చట్టం ద్వారా మత విద్వేషాలను రెచ్చగొట్టడమే లక్ష్యంగా పెట్టుకుంది.

సెక్షన్ 40ని రద్దు చేయడం ద్వారా ఏదైనా ఆస్తి, వక్ఫ్ ఆస్తి అవునా కాదా అని నిర్ణయించే అధికారాన్ని కూడా వక్ఫ్ బోర్డు పరిధి నుంచి తొలగించేసింది. ఏ కోణంలో చూసినా, కొత్త సవరణ చట్టం ద్వారా వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకోవడమే కాకుండా వాటిని కాపాడకుండా వుండేందుకు లొసుగులేమైనా వున్నాయా అనేది వెతుకుతున్నారు. బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు, ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. బిజెపి మిత్రపక్షాలైన టిడిపి, ఎల్.జె.పి లు బిల్లుకు మద్దతు ఇవ్వలేమని సంకేతాలు ఇచ్చాయి. బిల్లు పాస్ కావడం కష్టమని గ్రహించి జె.పి.సి కి నివేదించారు.

పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల్లో మోడీ 'చార్ సౌ పర్' లక్ష్యాన్ని ఓడించడంలో కొన్ని యూట్యూబ్ న్యూస్ ఛానెళ్లు, కొందరు యూట్యూబర్లు కీలక పాత్ర పోషించారు. ధృవ్ రాఠీ, రవీష్ కుమార్‌లతో కూడిన ఈ మీడియా గ్రూపులు, కోట్లాది మంది అనుసరించే మోడీ పాలనలోని భయానక పరిస్థితులను ప్రజల్లోకి తీసుకెళ్లాయి. వాటిని నియంత్రించేందుకు గత నవంబర్‌లో బ్రాడ్ కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లును తీసుకొచ్చి చివరి సెషన్‌లో ఆమోదించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున నిరసనలు తెలపడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. అక్టోబర్ 15 వరకు బిల్లుపై స్పందనలు సమర్పించవచ్చని, వాటిని పరిగణనలోకి తీసుకుని సమగ్ర చట్టం చేస్తామని వార్తా, ప్రసార శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలియజేశారు.

ప్రతిపక్షాలు గట్టిగా డిమాండ్ చేస్తున్న కుల గణనను చేపట్టేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమవుతోందని 'ది హిందూ' పత్రిక ఆగస్టు 22న పేర్కొంది. కోవిడ్‌ని సాకుగా చూపి 2021 జనాభా లెక్కల సేకరణ నుండి వెనక్కి తగ్గినందుకు ప్రభుత్వాన్ని ప్రతిపక్షం తీవ్రంగా విమర్శించింది. వాస్తవాలు, గణాంకాలకు ఈ ప్రభుత్వం భయపడుతోందనేది తరచుగా వస్తున్న ఆరోపణ. సామాజిక న్యాయం జరిగేలా కుల గణన నిర్వహించాలని ప్రతిపక్షం గట్టిగా డిమాండ్ చేసింది. ఈ రెండు డిమాండ్లను ఇంతవరకు మొండిగా తిరస్కరిస్తూ వచ్చిన ప్రభుత్వం...ఇప్పుడు వాటి నిర్వహణకు సిద్ధమంటూనే దానిని ఒక తంతుగా మార్చాలని చూస్తోంది.

ఏదేమైనప్పటికీ తాము సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నామని, గత పదేళ్ల పాలనలో మాదిరిగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం కుదరదని మోడీకి ఇప్పుడిప్పుడే బోధపడుతోంది. మోడీ, సంఘ్ పరివార్‌లు భారత ప్రజాస్వామ్య బలాన్ని మెల్లగానైనా అంగీకరించాల్సి వస్తోంది.

**/వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /**

# అమెరికాను ప్రసన్నం చేసుకోవడానికే ...

వ్యాఖ్య

ఉక్రెయిన్‌కు నరేంద్రమోడీ జరిపిన స్వల్పకాలిక పర్యటనను పెద్ద విజయంగా అమెరికా అనుకూల వర్గాల, కార్పొరేట్ మీడియా ప్రశంసలు కురిపించింది. ఢిల్లీలో జి20 సమావేశం నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయి పెంచుకున్న భారతీయ నేతగా ఈ ప్రశంసకులు ఆయనను కొనియాడారు. వర్ధమాన దేశాల నాయకుడుగా ఆయన గుర్తింపు పొందుతున్నట్టు చెప్పారు. కీవ్‌కు చారిత్రాత్మక పర్యటన జరపడం ద్వారా రష్యా, ఉక్రెయన్‌ల నడుమ ఒక మధ్యవర్తిత్వ పాత్ర పోషించేందుకు భారత దేశానికి బాట వేస్తున్నట్టు కూడా ఇవన్నీ చెప్పాయి.

అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మోడీ పర్యటన తర్వాత జరిపిన మీడియా గోష్టిలో కొన్ని కటువైన వ్యాఖ్యలు చేయడం ఈ వందిమాగధ మీడియా, అమెరికా అనుకూల వ్యాఖ్యాతల దురదృష్టం. రష్యా దగ్గర ఇండియా చమురు కొనడం ద్వారా దాని ఆయుధ పరిశ్రమకు నిధులు సమకూర్చడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శిఖరాగ్ర శాంతి సమావేశం జరపడంలో ఇండియాకు ఎలాంటి పాత్ర కల్పించడానికి జెలన్‌స్కీ నిరాకరించారు. శాంతి సదస్సు ప్రకటనలో పాలుపంచుకోని ఒక దేశంలో తాను ఒక శిఖరాగ్ర శాంతి సదస్సు జరపలేనని స్పష్టం చేశారు. స్విడ్జర్లాండ్‌లో జరిగిన శాంతి సదస్సు సంయుక్త ప్రకటనలో భారత దేశం పాలు పంచుకోకపోవడాన్ని ఆయన ఆ విధంగా ప్రస్తావించారు. విదేశాంగ శాఖ సహాయ కార్యదర్శి ఆ సదస్సుకు హాజరైనారు గానీ తుది ప్రకటనపై ఇండియా సంతకం చేయలేదు. తాను ఇండియా సందర్శించే సమయానికి అది తనవైపున వుండాలి గానీ అమెరికా, రష్యాల మధ్య సమతూక స్థితిలో వుండకూడదని కూడా జెలన్‌స్కీ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ మాటల తీరు చూస్తే ఆయన మోడీ కూడా తనలాగే అమెరికా జూనియర్ మిత్రుడని భావించినట్టు కనిపిస్తుంది. కాబట్టి తాను ఇలా మాట్లాడినా చెల్లుబాటవుతుందని కూడా ఆయన తలపోసినట్టున్నారు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)



**మోడీ రష్యా పర్యటన తర్వాత రెండు రోజులకే భద్రతా విషయాల సలహాదారు అజిత్ దోవల్ అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్‌ను కలుసుకున్నారు. అమెరికన్లను బుజ్జగించడమే ఈ సమావేశం ఉద్దేశం. వ్యూహాత్మక కలయికకు ఇండియా తీవ్రంగానే కట్టుబడి వుంటుందని చెప్పడం, టోక్యోలో జరగబోయే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరవుతుందనీ నిర్ధారించడం కోసం ఆయన కలిశారు. దీని వెనువెంటనే విదేశాంగ శాఖ వర్గాలు ఆగష్టు మూడవ వారంలో మోడీ ఉక్రెయిన్ పర్యటించే అవకాశం గురించి మాట్లాడ్డం మొదలెట్టారు. కనుక ఇక్కడ విదితమయ్యే విషయం ఒక్కటే. అమెరికాను శాంతింపచేయడానికి, అమెరికా కూటమి పట్ల ఇండియా స్వామిభక్తిని చాటుకోవడానికి మాత్రమే మోడీ ఉక్రెయిన్ సందర్శన తతంగం నిర్వహించారు.**

**కోపం తగ్గించడానికి తంటాలు**

భారత దేశం ఏదో విశ్వగురు అనుకునే వారికి తప్ప మిగిలిన వారందరికీ మోడీ కీవ్ పర్యటన ఉద్దేశమేమిటో స్పష్టమైంది. మాస్కోకు మోడీ పర్యటన వాషింగ్టన్‌లో నాటో 75వ వార్షికోత్సవంతో పాటే జరిగింది. మోడీ పుతిన్‌ను ఆలింగనం చేసుకోవడం, ఆయన నుంచి అత్యున్నత రష్యన్ పౌర పురస్కారం స్వీకరించడం అమెరికాకు ఆగ్రహం తెప్పించింది. పుతిన్ నాయకత్వంలోని రష్యాకు వ్యతిరేకంగా అన్ని శక్తులనూ మొహరించేందుకే నాటో సమావేశం ఉద్దేశించబడింది. అమెరికాకు ఇండో పసిఫిక్ నేస్తంగా వున్న మిత్ర దేశం సరిగ్గా ఆ సమయంలోనే బాహాటంగా శత్రువుతో కలసి కనిపిస్తున్నది.

బైడెన్ ప్రభుత్వ ప్రతినిధులు అనేకమంది జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్ నుంచి విదేశాంగ శాఖ ప్రతినిధి వరకూ దీనిపై తమ అనంగీకారం ప్రకటించారు. చివరి హెచ్చరిక జారీ చేసే పని మాత్రం భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టికి అప్పగించారు. భారత అమెరికా రక్షణ భాగస్వామ్యం ప్రపంచంలో ఎంతో ప్రభావశీలమైందనీ అయితే దాన్ని ఎలాగైనా చెల్లిపోతుందన్నట్టు తీసుకోవడం తగదనీ ఆయన హెచ్చరించారు. "ఇండియా వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం ఇష్టపడుతుందని నాకు తెలుసు. అయితే ఘర్షణ సమయాల్లో వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం వంటిదేదీ వుండబోదు" అన్నారాయన.

మోడీ రష్యా పర్యటన తర్వాత రెండు రోజులకే భద్రతా విషయాల సలహాదారు అజిత్ దోవల్ అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్‌ను కలుసుకున్నారు. అమెరికన్లను బుజ్జగించడమే ఈ సమావేశం ఉద్దేశం. వ్యూహాత్మక కలయికకు ఇండియా తీవ్రంగానే కట్టుబడి వుంటుందని చెప్పడం, టోక్యోలో జరగబోయే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరవుతుందనీ నిర్ధారించడం కోసం ఆయన కలిశారు. దీని వెనువెంటనే విదేశాంగ శాఖ వర్గాలు ఆగష్టు మూడవ వారంలో మోడీ ఉక్రెయిన్ పర్యటించే అవకాశం గురించి మాట్లాడ్డం మొదలెట్టారు. కనుక ఇక్కడ విదితమయ్యే విషయం ఒక్కటే. అమెరికాను శాంతింప చేయడానికి, అమెరికా కూటమి పట్ల ఇండియా స్వామిభక్తిని చాటుకోవడానికి మాత్రమే మోడీ ఉక్రెయిన్ సందర్శన తతంగం నిర్వహించారు.

**రష్యాతో తగ్గించుకుని.. అమెరికా వైపు..**

తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికాకు వెళ్లడం కూడా వారి పట్ల కట్టుబాటును మరింతగా విశదపర్చే ప్రక్రియలో భాగమే. మోడీ కీవ్‌కు వెళ్లిన రోజునే ఈ పర్యటన కూడా మొదలైంది. నాలుగు రోజుల ఈ పర్యటనలో భద్రతా సరఫరాల ఒప్పందం (ఎస్.ఓ.ఎస్.ఎ)తో పాటు అమెరికా కీలక కమాండ్ కేంద్రాలలో భారతీయ సైనికాధికారులను నియమించడం పైనా అవగాహనపై సంతకాలు చేశారు. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోళ్లు జోరుగా సాగుతున్న నేపథ్యంలో 5.86 కోట్ల డాలర్ల విలువైన జలాంతర్గామి విధ్వంసక సోనోబాయ్ పరికరాల అమ్మకానికి అమెరికా అంగీకరించింది. ప్రత్యేకించి ఆయుధ రంగంలో రష్యాతో వున్న దీర్ఘకాలిక అవగాహనను, మరీ ముఖ్యంగా స్వల్ప కాలంలో సైనిక సరఫరాలను ఇండియా వదులుకోలేదు. కానీ అదే సమయంలో మోడీ కీవ్ పర్యటన, రాజ్‌నాథ్ సింగ్ అమెరికా యాత్ర ప్రభుత్వం చేపట్టిన నూతన మార్గం ఏమిటో చెబుతున్నాయి. అమెరికాతో వ్యూహాత్మక సంఘటనను బలోపేతం చేసుకోవాలనీ, దీర్ఘకాల కోణంలో రష్యాపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవడానికి మోడీ ప్రభుత్వం సుముఖంగానే వుందని సంకేతమిస్తున్నాయి. అమెరికా మిత్రపక్షంగా వున్నాక వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం పెద్దగా ఏమీ వుండబోదనే పాఠం మోడీ సర్కారు నేర్చుకున్నట్టే కనిపిస్తుంది.

(ఆగష్టు28 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

# వృద్ధులకు వైద్యుల కొరత

అభిప్రాయం



మన దేశంలో దాదాపు ప్రతి వ్యాధికి స్పెషలిస్ట్ డాక్టర్లు ఉన్న విషయం తెలిసిందే. అదే విధంగా మహిళలకు, గర్భిణీలకు, చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్యులు ఉన్నారు. కానీ వృద్ధులకు ప్రత్యేక డాక్టర్ ఉంటారని చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. వాస్తవం కూడా. వృద్ధులకు వైద్యం అందించే ప్రత్యేక డాక్టర్లను 'జీరియాట్రిషియన్' అంటారు. 60 సంవత్సరాల వయస్సు దాటిన వారిని సాధారణంగా వృద్ధులు లేదా ముసలివారుగా పరిగణిస్తారు. ఆ విధంగా చూస్తే మన దేశంలో సుమారు 20 కోట్ల మంది ముసలివారు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచంలో అత్యధిక వృద్ధులు ఉన్న దేశాలైన జపాన్‌లో 28 శాతం, ఇటలీ 23 శాతం, అమెరికా 16 శాతంలో ఉన్నారు. ముఖ్యంగా వృద్ధాప్యం సమీపించే కొద్దీ అనేక అనారోగ్యాలకు గురవుతూ ఉంటారు. ముఖ్యంగా హైపర్ టెన్షన్ (బి.పి), డయాబెటిస్ (షుగర్), గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు సర్వసాధారణంగా కనిపించేవి. ఇటువంటి సందర్భంలో ఒక్కో జబ్బుకు కొన్ని రకాల మందులు వాడుతూ ఉంటారు. దీంతో అధికంగా డబ్బు ఖర్చు అవటంతో పాటు, సైడ్ ఎఫెక్ట్స్‌కి లోనవుతున్నారు. అదే జీరియాట్రిషియన్ అందుబాటులో ఉంటే తక్కువ ఖర్చుతో తక్కువ మందులు వాడుతూ ఉపశమనం పొందవచ్చు. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ఆసుపత్రుల్లో జీరియాట్రిషియన్ పోస్టులు అందుబాటులోకి తేవాలి.

ముఖ్యంగా మన దేశంలో వైద్య విద్య అభ్యసించే విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఈ వృద్ధుల వైద్యంపై దృష్టి సారించడం లేదు. చాలామందికి ఈ విద్య, వైద్యంపై అవగాహన లేదని తెలుస్తోంది. ఇటీవల కాలంలో వైద్యం కూడా వ్యాపారంగా మారిపోయింది. దీంతో అధికంగా డబ్బులు సంపాదించే ఉద్దేశంతో కొన్ని ప్రత్యేక వ్యాధులు పైనే దృష్టి సారించి, ఆయా చదువుల వైపే మొగ్గు చూపుతున్నారు. అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాల్లో జీరియాట్రిషియన్ డాక్టర్లలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆసుపత్రిలో ప్రత్యేక పోస్టులు ఏర్పాటు చేశారు. వాస్తవానికి మన దేశంలో నూటికి 9 మంది డాక్టర్లకు మాత్రమే వృద్ధుల అనారోగ్యాలపై అవగాహన ఉన్నది అని సర్వే తెలిపింది. వృద్ధులకు సంబంధించిన వైద్య చదువులు మన దేశంలో ఎక్కువగా ఉత్తర భారతదేశంలో అందుబాటులో ఉన్నాయి. మంగుళూరు, మణిపాల్, నాగాలాండ్‌లోని గ్లోబల్ ఓపెన్ యూనివర్సిటీ, ఇగ్నో వంటి సంస్థలు వృద్ధులకు సంబంధించిన అనేక వైద్య చదువులు అందిస్తుంది. అంతేకాకుండా, 2018లో మన దేశంలో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటైన వైద్యుల బృందం 'జీరియాట్రిక్ సొసైటీ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నాయి.

మన దేశంలో చంటి పిల్లలతో సమానంగా వృద్ధులు ఉన్నా, చంటి పిల్లల వైద్యులు ఉన్నంత ఎక్కువగా, వృద్ధులకు డాక్టర్లు లేకపోవడం బాధాకరం. ఇకనైనా ఈ అసమతుల్యతను సరిదిద్దే చర్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. ఎందుచేతనంటే, ప్రస్తుత జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న తరుణంలో దేశంలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. వారి ఆరోగ్య సమస్యలు తొలగించడానికి జీరియాట్రిషియన్ డాక్టర్ల అవసరం ఎంతైనా ఉంది. వైద్య కళాశాలలో జీరియాట్రిషియన్ కు సంబంధించిన ప్రత్యేక చదువులకుపై శ్రద్ధ చూపాలి. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో, గ్రామీణ, అర్బన్ క్లినిక్కులలో జీరియాట్రిషియన్ పోస్టులు వేయాలి. చంటి పిల్లలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో అదేవిధంగా వృద్ధులనూ భద్రంగా చూడవలసిన బాధ్యత మనందరిది.

**- ఐ. ప్రసాదరావు, సెల్ : 6405682733**

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

# నైట్ షిఫ్టా.. వామ్మో..

- వైద్యుల్లో అభద్రతా భావం
- 45 శాతం మంది డాక్టర్లదీ ఇదే పరిస్థితి
- ప్రభుత్వాస్పత్రుల్లో భద్రతా చర్యలు అధ్వాన్నం
- ఐఎంఏ సర్వేలో వెల్లడి




**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో రాత్రి షిఫ్టుల్లో పని చేసే వైద్యులు, వైద్య సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు మూడో వంతు మంది వైద్యులు అభద్రతా భావంలో ఉన్నారు. తమకు డ్యూటీ రూమ్‌లు లేవని 45 శాతం మంది వైద్యులు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జరిపిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

కోల్‌కతాలోని ఆర్జీకార్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటన తర్వాత దేశవ్యాప్తంగా వైద్యులు నిరసనలు చేస్తూ విధులు బహిష్కరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఐఎంఏ సర్వే వచ్చింది. ఐఎంఏ కేరళ విభాగం ఈ సర్వేను నిర్వహించింది. ఇందులో భాగంగా 3,885 మంది వైద్యుల నుంచి స్పందనలను తీసుకున్నారు. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో ఈ సర్వే నిర్వహించారు. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 80 శాతం మంది జూనియర్ డాక్టర్లే. వీరిలో అధికం నైట్ డ్యూటీల్లో ఉండేవారే.

ఈ సర్వే ప్రకారం.. 24.1 శాతం మంది డాక్టర్లు అభద్రతగా ఉన్నామని చెప్పారు. మరో 11.4 శాతం మంది 'చాలా వరకు సురక్షితంగా' లేమని అన్నారు. అయితే, ఈ అభద్రత భావన మహిళా వైద్యుల్లో ఎక్కువగా ఉన్నది. 36.7 శాతం మంది అభద్రత భావనలో ఉన్నామనీ, 32.5 శాతం మంది చాలా అభద్రత భావనలో ఉన్నామని చెప్పారు. నైట్ షిఫ్టుల్లో డ్యూటీ రూమ్‌లు లేవని 45 శాతం మంది తెలిపారు. డ్యూటీ రూమ్‌లు లేకపోవటంతో వైద్యులు ప్రత్యామ్నాయాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతి ఒక్క ఆరోగ్య సంరక్షణ సంస్థ డాక్టర్లు, వైద్య సిబ్బందికి సురక్షితమైన, సౌకర్యవంతమైన పని బాధ్యతను అందించే బాధ్యతను తీసుకోవాలని కేరళ ఐఎంఏ రీసెర్చ్ సెల్ చైర్మెన్, నివేదిక ప్రధాన రచయిత డాక్టర్ రాజీవ్ జయదేవన్ సూచించారు.

ఇక ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది ఎక్కువ స్థాయిలో అభద్రతను కలిగి ఉన్నట్టు చెప్పారు. వీరిలో 17.05 శాతం మంది 'చాలా అభద్రతగా', 27.4 శాతం మంది 'అభద్రత'గా (మొత్తంగా 44.5 శాతం మంది) ఉన్నట్టు చెప్పారు. అయితే, ప్రయివేటు వైద్యులు, సిబ్బంది విషయంలో ఇది భిన్నంగా ఉన్నది. వారిలో అభద్రతా భావన తక్కువగా ఉన్నది. కేవలం 5.52 శాతం మంది మాత్రమే అభద్రతగా భావిస్తున్నామని చెప్పగా.. చాలా అభద్రతగా ఉన్నామని 12.2 శాతం మంది (మొత్తంగా 17.5 శాతం మంది) చెప్పారు.

ప్రయివేటు వైద్య సిబ్బందిలో 28.04 మంది భద్రతగా ఉన్నామని భావిస్తున్నారు. ఇది ప్రభుత్వాస్పత్రుల్లో 8.71 శాతంగానే ఉండటం గమనార్హం. 10.22 శాతం మంది ప్రయివేటు వైద్య సిబ్బంది మరింత భద్రతను కలిగి ఉన్నామని చెప్పగా.. ప్రభుత్వ వైద్య సిబ్బంది విషయంలో ఇది 1.89 శాతంగానే ఉండటం గమనార్హం. మొత్తంగా, 38.3 శాతం మంది ప్రయివేటు సెక్టార్ వైద్య సిబ్బంది భద్రతగా ఉన్నామని చెప్పగా.. ప్రభుత్వ సెక్టార్ వైద్య సిబ్బంది విషయంలో ఇది 10.6 శాతంగానే ఉండటం గమనార్హం. ఆస్పత్రుల్లో భద్రతపై ఆందోళన కలుగుతున్నది. ముఖ్యంగా, ప్రయివేటు ఆస్పత్రుల విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉన్నది. అయితే, ఆస్పత్రుల పరిసర ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది సరిపడా లేదని చాలా మంది వైద్యులు తెలిపారు. అంతేకాకుండా, వ్యయభారంపై దృష్టిపెట్టిన ఆస్పత్రులు తక్కువ వేతనాలకు వచ్చే భద్రతా సిబ్బందిని నియమిస్తున్నాయని చెప్పారు. భద్రత సిబ్బందిని నియమించే విషయంలో ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు, శారీరకంగా బలంగా ఉండేవారిని నియమించాలని వైద్యులు సూచిస్తున్నారు.

## 'ఉక్కు' పరిరక్షణకు 1న ధర్నాలు

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సెప్టెంబర్ 1న సిఐటియు ఆధ్వర్యంలో విశాఖలోని అగనంపూడి ఎస్‌బిఐ జంక్షన్, వడ్లపూడి సచివాలయం, పెదగంట్యాడ ఏరియాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికసంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1296వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 1న ఆందోళనలకు పిలుపునిచ్చామని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం సీనియర్ నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపదని, కార్పొరేట్లకు అప్పగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉక్కు కర్మాగారం ఆవిర్భావం నుంచి జరిగిన పోరాటాలను గుర్తుచేశారు. కేంద్రంపైనా, స్థానిక ఉక్కు యాజమాన్యం తీరుపైనా పోరాటాలు చేయడం ద్వారానే ప్లాంట్‌ను కాపాడుకోగలమని పేర్కొన్నారు.



# 'నామినేటెడ్'పై కమలం పేచీ

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

ప్రభుత్వం ఏర్పడి మూడునెలలు దాటింది వంద రోజులు కూడా కాకముందే పదవుల పందేరంపై కూటమిలో ముసలం ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. నామినేటెడ్ పోస్టుల్లో ఎక్కువ వాటాపై బిజెపి నేతలు గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలిసింది. గెలిచిన స్థానాలతో సంబంధం లేకుండా నామినేటెడ్ పోస్టులను కోరుతుండటంతో తెలుగుదేశం ఇబ్బందుల్లో పడుతున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఇరు పార్టీల మధ్య చర్చలు కూడా పెద్దయెత్తున జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 230 వరకు కీలక నామినేటెడ్ పోస్టులు ఉన్నాయి. వాటిని భర్తీ చేసేందుకు చంద్రబాబు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. కూటమిలో గెలిచిన స్థానాల ప్రాతిపదికన పదవుల పంపకాలు చేయాలని నిర్ణయించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు మొత్తం పదవుల్లో బిజెపికి 9 నుంచి 10 శాతం పదవులు ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ పార్టీ గడచిన ఎన్నికల్లో ఎనిమిది శాసనసభ స్థానాలతోపాటు నాలుగు లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. జాతీయ స్థాయి పార్టీగా ఉన్న తమకు ఆ శాతం పదవులు చాలవని, మరిన్ని ఎక్కువ కేటాయించాలని బిజెపి పట్టుబడుతున్నట్లు తెలిసింది. దాదాపు 20 నుంచి 25 శాతం వరకు పదవులు తమకు ఇవ్వాలని, అందులో అత్యంత కీలకమైన తిరుపతి తిరుమల దేవస్థానం ఛైర్మన్ పదవి కూడా ఉండాలని చెబుతున్నట్లు సమాచారం.

**తమ్ముళ్ల ఒత్తిళ్లు**

ఐదేళ్లుగా పదవులపై ఆశలు పెంచుకున్న తెలుగు తమ్ముళ్లు, నేతలకు ఈసారి ఎక్కువగా పదవులు ఇవ్వాల్సి వస్తుందన్న భావనను చంద్రబాబు వ్యక్తం చేస్తున్నారు. జనసేన, బిజెపికి కలిపి 40 శాతం పదవులు ఇచ్చేస్తే ఇక తెలుగుదేశానికి కేవలం 140 పదవులు మాత్రమే మిగిలే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. బిజెపి ఒత్తిళ్లకు తల వంచకూడదని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాదు కూడదు అనుకుంటే మరో మెలికకు ఆయన సిద్ధమవుతున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. జాతీయ స్థాయిలో కూడా వేల సంఖ్యలోనే నామినేటెడ్ పదవులు ఉంటాయి. రాష్ట్రంలో బిజెపికి ఎక్కువ పదవులు ఇవ్వాల్సి వస్తే కేంద్ర పదవుల్లో కూడా తమకు ఎక్కువ శాతం ఇవ్వాలన్న ప్రతిపాదనను సిఎం చంద్రబాబు తెరపైకి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని బిజెపి నేతలకు ఆయన సూచనప్రాయంగా చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఢిల్లీ పెద్దలతో చంద్రబాబు చర్చించేందుకు యోచిస్తున్నట్లు తెలిసింది.

# సిపిని కలిసిన సినీ నటి జత్వాని

- ముగ్గురు ఐపిఎస్‌లపై ఫిర్యాదు

**ప్రజాశక్తి- విజయవాడ**

ముంబయికి చెందిన సినీ నటి కాదంబరి జత్వాని శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వి.రాజశేఖర్‌బాబును కలిశారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆమె తన న్యాయవాదులతో వచ్చి సిపిని కలిసి ముగ్గురు ఐపిఎస్ అధికారులు తనను అప్పట్లో వేధించారని ఫిర్యాదు చేశారు. ఆమె వాంగ్మూలాన్ని పోలీసులు రికార్డు చేశారు. అనంతరం మీడియాతో జత్వాని మాట్లాడుతూ నిజాలు బయటకు రావాలన్నారు. తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని, తన వ్యక్తిగత హననానికి పాల్పడ్డారని వాపోయారు. తన కుటుంబసభ్యులు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు, ఆధారాలను పోలీసులకు అందజేశానని చెప్పారు. విద్యాసాగర్‌పై కేసులు ఉన్నాయని, ఆయన పెళ్లి ప్రస్తావన తెస్తే వ్యతిరేకించానని తెలిపారు. అందుకే తనపై కక్షకట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె తరపు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ జత్వానిపై ఎక్కడా ఎటువంటి కేసులూ లేవని, కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు. 41ఎ నోటీసులు ఇవ్వాల్సిన కేసులో కుట్రపూరితంగా వ్యవహరించారని, నటి జత్వాని తల్లిదండ్రులనూ జైలులో పెట్టి బెయిల్ రాకుండా చేశారని తెలిపారు. జత్వానిపై ఫిర్యాదు చేసిన కుక్కల



విద్యాసాగర్ చూపుతున్న అగ్రిమెంట్ కూడా కేసు పెట్టడం కోసం తయారు చేసిందేనని ఆరోపించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో బందోబస్తుతో విజయవాడకు కాదంబరి వచ్చినట్లు తెలిసింది. ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఆమెపై అక్రమ కేసు పెట్టి వేధించినట్లు ఆరోపణలు వస్తున్నందున ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో విజయవాడ వచ్చి సిపిని కలిసి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఆ ఫొటో నాది కాదు : విద్యాసాగర్**

నటి జత్వానీ చేస్తున్న ఆరోపణలను జడ్‌పి మాజీ చైర్మన్ కుమారుడైన కుక్కల విద్యాసాగర్ ఖండించారు. ఈ వ్యవహారంపై ఆయన తొలిసారి ఓ మీడియాతో మాట్లాడారు. 'నేను ముంబయిలో వ్యాపారం చేస్తున్నప్పుడు ఆమె నాకు పరిచయమైంది. అప్పట్లో ఫొటోలు దిగాను. 2014 నుంచి జత్వానీ నన్ను డబ్బు కోసం బ్లాక్ మెయిల్ చేస్తోంది. ఆమె చూపిస్తున్న అర్ధనగ్న ఫొటో నాది కాదు. ఆ ఫొటోను ఫోరెన్సిక్‌కు పంపుకోవచ్చు' అని చెప్పారు.



# ప్రకాశం బ్యారేజీకి పోటెత్తిన వరద

- 3 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంపాలు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రకాశం బ్యారేజి నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం పెరగడంతో సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి 8 గంటలకు అందిన సమాచారం ప్రకారం శ్రీశైలం నుంచి 3.82 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద చేరుతోంది. సాగర్ జలాశయానికి 3.11 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు డ్యామ్‌కు ఉన్న 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి పులిచింతలకు 2.65 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 3.11 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 38.65 టిఎంసిలుగా ఉంది. పులిచింతల నుంచి వస్తున్న నీటిని ప్రకాశం బ్యారేజికి మళ్లిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి 3 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా అదేస్థాయిలో వరద నీటిని దిగువకు వదులుతున్నారు. డెల్టాలోని కాల్వలకు 11 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

# రక్షకులే భక్షకులా?

**జైత్వాని, గుడ్లవల్లేరు ఘటనలపై ఐద్వా ఆగ్రహం**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముంబయి నటి కాదంబరి జైత్వాని ఘటనలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి కోరారు. జైత్వాని కేసులో సమగ్ర విచారణకు ప్రభుత్వం సిద్ధపడటం హర్షణీయమని అన్నారు. జిందాల్‌పై ముంబయిలో కేసు నమోదు చేసిన జత్వానీని రాష్ట్రంలో ఐపిఎస్ అధికారులే పూనుకుని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం తీవ్రమైన విషయమని తెలిపారు. అది కూడా మోసం చేశారన్న ఆరోపణలతో ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఎపి పోలీసులు అరెస్టు చేసి కోర్టులో పెట్టి విషయాన్ని మీడియాకు కూడా తెలపలేదని విమర్శించారు. మార్చి నెలలో ముంబయిలో రేప్ కేసు పెట్టినా ఆధారాలు లేవని, వాంగ్మూలం ఇవ్వలేదని కేసు కొట్టేసినట్లు ఆంగ్ల పత్రికల్లో ప్రముఖంగానే ప్రచురించడం చూసినప్పుడు వ్యాపార కుటుంబానికి సహకరించడానికి ఆంధ్రా పోలీసులు, అధికారులు అక్రమంగా వ్యవహరిస్తే అది తీవ్రమైన నేరంగానే పరిగణించాలని కోరారు. ఎటువంటి అనుమానాలకూ తావివ్వకుండా విచారించాలని, సాక్ష్యాధారాలను పక్కాగా స్వీకరించి ఈ అక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చర్య తీసుకోవాలని కోరారు.

కృష్ణా జిల్లాలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా అమ్మాయిల ప్రైవసీకి సంబంధించిన ఫొటోలు తీసినట్లు ప్రచారం జరుగుతుండటంతో, ఆందోళనతో అర్ధరాత్రి విద్యార్థినులు నిరసనకు దిగారని తెలిపారు. వారి ఆవేదనను యాజమాన్యం పట్టించుకోవడం లేదని వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. సత్వర విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కమిటీ తరపున వారు డిమాండ్ చేశారు.

# అన్‌స్టాపబుల్‌గా ముందుకు

- బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానంపై చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్‌స్టాపబుల్‌గా బాలయ్య ముందుకు సాగాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నందమూరి బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్నారని శుక్రవారం ఎక్స్‌లో శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. 50 ఏళ్ల క్రితం విడుదలైన 'తాతమ్మ కల' చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారని పేర్కొన్నారు. ఇప్పటికీ అగ్ర హీరోగా రాణిస్తూ, నేటి తరాన్ని కూడా అలరించే చిత్రాలతో బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొడుతున్నారని కొనియాడారు. కథానాయకుడిగానే కాకుండా ప్రజానాయకుడిగా కూడా రాణిస్తున్న బాలకృష్ణ మరిన్ని రికార్డులను సృష్టించి, మరెన్నో మైలురాళ్లను అధిగమించి అన్‌స్టాపబుల్‌గా ముందుకు సాగాలని కోరారు. 50 ఏళ్లుగా వెండితెరపై తిరుగులేని కథానాయకుడిగా వెలుగుతున్న 'బాల మామయ్య'కు హృదయపూర్వక శుభాకాంక్షలు అని టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలు హీరోగా 109 సినిమాల్లో నటించి అవార్డులు - రివార్డులు అందుకుని రికార్డు సృష్టించారని అన్నారు.

# నిత్య కృషీవలుడు చంద్రబాబు

- మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్య కృషీవలుడని పరిశ్రమలశాఖ మంత్రి టిజి భరత్ పేర్కొన్నారు. మొదటిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి సెప్టెంబరు ఒకటితో 30 ఏళ్లు గడుస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, టిడిపి రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి టిడిపి కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలను దేశంలో అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని చెప్పారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు గెలిచి ఉంటే రాజధాని అమరావతి అద్భుతంగా ఉండేదని తెలిపారు. అశోక్ బాబు మాట్లాడుతూ.. దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కారు చేశారని తెలిపారు. ఆ తరువాత చంద్రబాబు సుదీర్ఘకాలం రాజకీయ నేతగా ఉన్నారని చెప్పారు.

# తునిలో నిలిచిపోయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

లింగంపల్లి నుంచి వస్తున్న 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం నిలిచిపోయింది. ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా రైలు తుని స్టేషన్‌లో నిలిచిపోయినట్టు అధికారులు తెలిపారు. అనంతరం మరమ్మతులు చేసి అర్ధరాత్రి బయల్దేరి వెళ్లింది. సాయంత్రం 5:38 గంటలకు తుని చేరుకున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ ప్రకారం రాత్రి 7:45 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉండగా రాత్రి 9:15 గంటల వరకూ తునిలోనే నిలిచిపోయింది.


# సిఎం చేతుల మీదుగా నేడు ఓర్వకల్లులో పింఛన్ల పంపిణీ ప్రారంభం

**పర్యటనలో స్వల్ప మార్పు**

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి, అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించాల్సి ఉంది. వాతావరణంలో మార్పులు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఓర్వకల్లు మండల కేంద్రానికి ఈ కార్యక్రమం మార్పు జరిగింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి చేరుకుంటారు. అక్కడి నుంచి ఓర్వకల్లులోని సభా ప్రాంగణానికి వచ్చి పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ పింఛనుదారులతో ముఖాముఖి నిర్వహించి ప్రసంగించనున్నారు. అనంతరం ప్రత్యేక విమానంలో చంద్రబాబు హైదరాబాద్ వెళ్లనున్నారు.

# రెండోరౌండ్‌లోనే ఓడిన అల్కరాజ్



- 74వ ర్యాంకర్ చేతిలో అనూహ్య ఓటమి
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

**న్యూయార్క్:** యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో పెను సంచలనం నమోదైంది. 3వ సీడ్, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో అల్కరాజ్ నెదర్లాండ్స్‌కు చెందిన 74వ ర్యాంక్ ప్లేయర్ బొటిక్ వాన్ డి జాండ్‌స్కల్ప్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. బొటిక్ 6-1, 6-5, 6-4 తేడాతో వరుస సెట్లలో అల్కరాజ్‌పై విజయం సాధించాడు. 2021 వింబుల్డన్ తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్‌లో రెండో రౌండ్‌లోనే నిష్క్రమించడం అల్కరాజ్‌కు ఇది తొలిసారి. ఇతర పోటీల్లో 5వ సీడ్, రష్యాకు చెందిన మెద్వదెవ్ 6-3, 6-2, 7-6(7-5)తో మొరోజోసన్(హంగేరీ)పై, టామీ పాల్ 7-5, 6-0, 1-0 ఆధజక్యతలో ఉండగా పుర్సెల్(ఆస్ట్రేలియా) గాయంతో వైదొలిగాడు.

**ప్రి క్వార్టర్స్‌కు గాఫ్, జంగ్**

మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి 3వ సీడ్, అమెరికా సంచలనం కోగా గాఫ్, 7వ సీడ్, చైనాకు చెందిన క్యుడబ్ల్యు. జెంగ్, ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మూడోరౌండ్ పోటీలో గాఫ్ 3-6, 6-3, 6-3తో 27వ సీడ్, ఉక్రెయిన్‌కు చెందిన స్వెటోలీనాను చిత్తుచేసింది. మరో పోటీలో జంగ్ 6-2, 6-1తో నేమియర్ (జర్మనీ)పై వరుససెట్లలో విజయం సాధించింది. మరో సంచలనం నమోదైంది. 4వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన రైబకినా అర్థాంతరంగా మ్యాచ్ నుంచి వైదొలిగింది. అన్‌సీడెడ్, ఫ్రాన్స్‌కు చెందిన పోన్సెట్‌తో రెండోరౌండ్ మ్యాచ్ తలపడాల్సి ఉన్న రైబకినా.. మ్యాచ్‌ను వైదొలగడంతో ఆమె మూడోరౌండ్‌కు చేరింఇ. మరో పోటీలో బెలారస్‌కు చెందిన పవుంఛెకోవా 5-7, 6-1, 6-2తో కొకొలర్టె(ఇటలీ)పై గెఉలిచి మూడోరౌండ్‌కు చేరింది. మరో పోటీలో ముఛోవా(చెక్) 6-3, 7-6(7-5)తో జపాన్‌కు చెందిన ఒసాకాను, వాజియాస్కీ(డెన్మార్క్) 6-3, 6-3తో జరాజువా(మెక్సికో)ను ఓడిచి మూడోరౌండ్‌కు చేరారు.

# అట్కిన్సన్ సెంచరీ

- భారీ ఆధిక్యత దిశగా ఇంగ్లండ్
- శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 196ఆలౌట్



**లండన్:** రెండోటెస్ట్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు భారీ ఆధిక్యత దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంకను కేవలం 196పరుగులకే ఆలౌట్ చేసిన ఇంగ్లండ్ 231పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ రెండోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 25పరుగులు చేసింది. దీంతో ఇంగ్లండ్‌కు ఇప్పటికే 256పరుగుల ఆధిక్యత లభించింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 7వికెట్ల నష్టానికి 358పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 427పరుగులకు ఆలౌటైంది. అట్కిన్సన్ (118) సెంచరీకి తోడు పాట్స్(21) బ్యాటింగ్‌లో రాణించారు. శ్రీలంక బౌలర్లు ఫెర్నాండోకు ఐదు, రత్నాయకే, కుమారకు రెండేసి వికెట్లు దక్కాయి. శ్రీలంక జట్టులో కుశాల్ మెండీస్(74) అర్ధసెంచరీకి తోడు ఛండీమాల్(23), మాథ్యూస్(22) బ్యాటింగ్‌లో రాణించా రు. ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్, స్టోన్, పాట్స్‌కు రెండేసి, అట్కిన్సన్, బషీర్‌కు ఒక్కోటి దక్కాయి.

# మందగించిన జిడిపి

**• జూన్ త్రైమాసికంలో 6.7 శాతమే •15 నెలల కనిష్టానికి పతనం • వ్యవసాయం డీలా**



**న్యూఢిల్లీ :** భారత ఆర్థిక వ్యవస్థ మందగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి 6.7 శాతానికి పడిపోయింది. దీంతో 15 నెలల కనిష్టానికి క్షీణించిందని శుక్రవారం స్వయంగా కేంద్ర ప్రభుత్వ గణంకాల మంత్రిత్వ శాఖనే వెల్లడించింది. 2022-23 ఇదే త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇంతక్రితం 2023 మార్చి త్రైమాసికంలో అత్యల్పంగా 6.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఆ తర్వాత ఎక్కువగా పడిపోవడం ఇదే తొలిసారి. ఆర్‌బిఐ అంచనాలు మించి జిడిపి పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల ఆందోళన కలిగిస్తోంది.

జూన్ త్రైమాసికంలో భారత జిడిపి 7.1 శాతం పెరగొచ్చని ఇటీవలే ఆర్‌బిఐ అంచనా వేసింది. 2024-25లో స్థూలంగా 7.2 శాతంగా ఉండొచ్చని తెలిపింది. దీనికి భిన్నంగా కేంద్ర గణంకాల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్‌ఎస్‌ఒ) ఫలితాలను వెల్లడించడం విశేషం. ఒక ఏడాదిలో దేశంలో ఉత్పత్తి అయిన సరకులు, సేవల మొత్తం విలువను జిడిపిగా పేర్కొంటారు. ఇది ఆర్థిక వ్యవస్థ పనితీరును తెలుపుతోంది. జిడిపి పడిపోతుందంటే దేశంలో ఆర్థిక కార్యకలాపాలు సన్నగిల్లుతున్నాయని అర్థం.

ఎన్‌ఎస్‌ఒ గణంకాల ప్రకారం.. గడిచిన క్యూ1లో వ్యవసాయ రంగం వృద్ధి ఏకంగా 2 శాతానికి పడిపోవడం చాలా ఆందోళకర అంశం. ఈ రంగం 2023-24 ఇదే త్రైమాసికంలో 3.7 శాతం వృద్ధిని కనబర్చింది. ఇదే సమయంలో ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనరల్ సర్వీసెస్ రంగాలు 12.6 శాతం వృద్ధిని కనబర్చగా.. గడిచిన క్యూ1లో 7.1 శాతానికి మందగించాయి. తయారీ రంగంలో మాత్రం 7 శాతం పెరుగుదల ఉంది. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సర్వీసెస్ రంగాలు 10.4 శాతం పెరిగాయి. ఈ రంగాలు గతేడాది ఇదే జూన్ త్రైమాసికంలో 3.2 శాతం మాత్రమే వృద్ధిని కలిగి ఉన్నాయి. వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ సర్వీసెస్ విభాగాల వృద్ధి ఏకంగా 5.7 శాతానికి మందగించింది. ఈ రంగం గతేడాది ఏకంగా 9.7 శాతం వృద్ధిని నమోదు చేసింది.

### కీలక రంగాల పడక

దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాలు డిమాండ్ లేక పడకేశాయి. ప్రస్తుత ఏడాది జులైలో కీలక రంగాల వృద్ధి 6.1 శాతానికి పరిమితమయ్యింది. 2023 ఇదే మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు 8.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై కాలంలో ఈ రంగాలు 6.1 శాతం మాత్రమే పెరిగాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 6.6 శాతం వృద్ధిని కనబర్చాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రంగాల వృద్ధి పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనుంది.



## ఫిన్‌టెక్ రంగ అభివృద్ధికి కృషి : ప్రధాని మోడీ

**ముంబయి :** ఫిన్‌టెక్ రంగాన్ని పెంచి పోషించేందుకు విధాన స్థాయిలో ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. గత పదేళ్ళలో ఈ రంగంలోకి 3100 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని, ఈ విభాగం మరింత అభివృద్ధి చెందే దిశగా యాంజెల్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేశమన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్, 2024లో ప్రధాని ప్రసంగించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా రెగ్యులేటర్లను కోరారు. ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యతను మరింత పెంచాలని కోరారు. ఆర్థిక సేవలను ప్రజాస్వామీకరించడంలో ఫిన్‌టెక్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని మోడీ పేర్కొన్నారు. ఫిన్‌టెక్ సమాంతర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందన్నారు. ఆర్థిక సేవల రంగంలో గ్రామాలు, నగరాల మధ్య అంతరాన్ని ఇది తగ్గిస్తోందన్నారు. ఫిన్‌టెక్ స్టార్టప్‌లు ఏకంగా 500శాతం పెరిగాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ, ఆర్థిక కార్యకలాపాలను అందరికీ విస్తరించడంలో, సామర్థ్యం మెరుగుపరుచుకోవడంలో డిజిటల్ సాంకేతికతలు ఒక సాధనంగా వున్నాయన్నారు.


కాగా వచ్చే సెప్టెంబరు 3, 4 తేదీల్లో ప్రధాని మోడీ బ్రూనై, సింగపూర్‌ల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో తెలిపారు..

## భారతీయుల్లో సూక్ష్మపోషకాల లోపం

**• లాన్సెట్ అధ్యయనం వెల్లడి**

**న్యూఢిల్లీ :** భారతీయుల్లో సూక్ష్మపోషకాల లోపంపై లాన్సెట్ అధ్యయనం హెచ్చరిస్తున్నది. భారత్‌లోని స్త్రీ, పురుషుల్లో అన్ని వయసులవారు ఆరోగ్యానికి ముఖ్యమైన ఐరన్, కాల్షియం, ఫొలేట్ వంటి సూక్ష్మపోషకాలను సరిపడా తీసుకోవటంలేదని అంచనా వేసింది. 'ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ఈ అధ్యయనాన్ని ప్రచురించింది. ఈ అధ్యయనం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం(500 కోట్ల మందికి పైగా) మంది ప్రజలు సరిపడా అయొడిన్, విటమిన్ ఈ, కాల్షియంలను తీసుకోవటంలేదు. ముఖ్యంగా, ఒక దేశంలో, ఒకే వయసువారిలో మహిళలు అయొడిన్, విటమిన్ బీ12, ఐరన్‌ను మగవారితో పోలిస్తే తగినంతగా తీసుకోవటంలేదని పరిశోధకులు గుర్తించారు. ఇక పురుషులు.. మహిళలతో పోలిస్తే మెగ్నీషియం, విటమిన్ బీ6, జింక్, విటమిన్ సీ లను తగిన మొత్తంలో తీసుకోవటం లేదు. భారత్‌లోనూ చాలా మంది మహిళలు పురుషులతో పోలిస్తే తగినంత మొత్తంలో అయోడిన్‌ను పొందటంలేదు. ఇక మహిళలతో పోలిస్తే పురుషులు సరిపోని మొత్తంలో జింక్, మెగ్నీషియంలను తీసుకుంటున్నారు. 10 నుంచి 30 ఏండ్ల వయసు మధ్య ఉన్న పురుషులు, మహిళల్లో చాలా మంది తక్కువ స్థాయిలో కాల్షియం తీసుకుంటున్న అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా, దక్షిణాసియా, ఈశాన్య ఆసియా, ఉప సహారా ఆఫ్రికాలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని పరిశోధన బృందం తెలిపింది.

## బిజెపిలో చేరిన చంపయి సోరెన్



**రాంచీ :** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయి సోరెన్ శుక్రవారం బిజెపిలో చేరారు. జెఎంఎంలోని అన్ని పదవులకు, అలాగే ఎమ్మెల్యే పదవికి చంపాయ్ బుధవారం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సమక్షంలో తన మద్దతుదారులతో కలిసి చంపాయ్ బిజెపిలో చేరారు. కాగా, జార్ఖండ్ అసెంబ్లీకి ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్నాయి.

## రాజ్యాంగ, న్యాయ విషయాల్లో అపార మేధావి

**• ఎజి నూరాని మృతికి సీతారాం ఏచూరి సంతాపం**

**న్యూఢిల్లీ :** ప్రముఖ న్యాయవాది, రచయిత అబ్దుల్ గఫూర్ నూరాని మరణం పట్ల సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాజ్యాంగం, న్యాయ విషయాల్లో నూరాని అపార మేధావి అని తెలిపారు. 1993లో గోల్వాల్కర్ భావజాలాన్ని బట్టబయలు చేస్తూ తాను రాసిన కరపత్రం 'వాట్ ఈజ్ దిస్ హిందూ రాష్ట్ర' చదవి నూరాని అభినందించారని గుర్తు చేసుకున్నారు. ముంబయిలోని నూరాని నివాసానికి ఆహ్వానించి బిర్యాని తినిపించారని స్మరించుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరం స్నేహితులమయ్యామని తెలిపారు. నూరాని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఏచూరి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఒపిఎస్‌ను అమలు చేయాల్సిందే

**• సెంట్రల్ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం**

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్), ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) రెండూ ఉద్యోగుల ప్రయోజనాలకు ఒరిగేదేమీ లేదని సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సిఎస్‌ఎస్) అధికారుల సంఘం పేర్కొంది. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేసింది. అదొక్కటే మార్గమని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం ప్రకటన విడుదల చేసింది. ఎన్‌పిఎస్‌లో పెన్షన్ హామీ నిబంధన లేదని, యుపిఎస్ 30 నుండి 35 ఏళ్ల వరకు సర్వీస్ చేసిన తరువాత కూడా ఎటువంటి సహేతుకమైన కార్పస్ నిబంధన లేదని తెలిపింది. సిఎస్‌ఎస్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి అశుతోష్ మిశ్రా మాట్లాడుతూ.. ఒపిఎస్‌కు ఎన్‌పిఎస్, యుపిఎస్ సరితూగవని అన్నారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు.

**ఒపిఎస్ అమలు చేసే వరకు ఉద్యమం ఆపం : మంజీత్ సింగ్**

ఒపిఎస్ వల్ల ఉన్న అనేక ప్రయోజనాలు యుపిఎస్, ఎన్‌పిఎస్‌లకు లేవని ఆలిండియా ఎన్‌పిఎస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు మంజీత్ సింగ్ పటేల్ అన్నారు. ఒపిఎస్ కింద, ఉద్యోగులు తమ చివరిగా డ్రా చేసిన బేసిక్ పే, డియర్‌నెస్ అలవెన్స్‌లో 50 శాతం పెన్షన్‌గా పొందారని ఆయన అన్నారు.

## కులగణనపై బిజెపికి జెడియు షాక్

**పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో ప్రతిపక్షానికి మద్దతు**

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

కులగణనపై కేంద్రంలోని అధికార బిజెపికి ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షం జెడియు షాక్ ఇచ్చింది. కులగణన నిర్వహించాల్సిందేనని పట్టు పట్టింది. జరిగిన పార్లమెంటరీ కమిటీ తొలి సమావేశంలో కులగణనపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్‌కు జెడియు మద్దతు పలికింది. జనాభా గణనలో కులగణనపై చర్చ జరగాలన్న డిమాండ్‌ను మొదట డిఎంకె ఎంపిఆర్ బాలు లేవనెత్తారని, ఆ తరువాత కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్, జెడియు ఎంపి గిరిధారి యాదవ్ డిమాండ్ చేశారు. ఒబిసి సంక్షేమానికి సంబంధించిన పార్లమెంటరీ కమిటీ తన మొదటి సమావేశంలో రాబోయే సంవత్సరపు ఎజెండాను నిర్ణయించడంపై చర్చించింది. జెడియు ఎంపి గిరిధారి యాదవ్ మద్దతు పొందిన అనేక మంది ప్రతిపక్ష సభ్యుల నుండి డిమాండ్ చేసిన తరువాత, కమిటీ చర్చించబోయే సబ్జెక్టులలో ఒకటిగా 'కులగణన'ను ఎంచుకుంది. సమావేశంలో 30 సబ్జెక్టుల జాబితాను ప్యానెల్ ముందు ఉంచారు. డిఎంకె ఎంపి టిఆర్ బాలు కులగణనపై చర్చ అవసరమని లేవనెత్తారు. ఆయనకు కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్ మద్దతు పలికారు. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న జనాభా గణనకు సన్నాహకాల పరిస్థితిపై హోంమంత్రిత్వ శాఖ నుండి కమిటీ తప్పనిసరిగా వివరణ కోరాలని ఠాగూర్ అన్నారు. ఆయనకు టిఎంసి ఎంపి కల్యాణ్ బెనర్జీ మద్దతు పలికారు. ప్రభుత్వం విజయవంతమైన గణనను నిర్వహించి, ఫలితాలను ప్రచురించిన బీహార్‌ను ఉదాహరణగా చెబుతూ, దేశవ్యాప్తంగా ఈ కసరత్తు చేయాల్సిన అవసరం ఉందని జెడియు ఎంపి గిరిధారి యాదవ్ అన్నారు.

## అరేబియాలో తుపానుగా మారిన అల్పపీడనం

**న్యూఢిల్లీ :** అరేబియా సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం శుక్రవారం తుపానుగా మారింది. దీనికి 'అస్నా'గా పేరు పెట్టారు. కచ్చా తీర ప్రాంతంలో, పాకిస్తాన్ సమీప ప్రాంతాల్లో ఇది ఉధృత రూపం దాల్చిందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. 1976 తర్వాత ఆగస్టు మాసంలో అరేబియా సముద్రంలో ఏర్పడిన మొదటి తుపాను ఇదే. 1891 నుండి 2023 మధ్య అరేబియా సముద్రంలో ఆగస్టు మాసంలో కేవలం మూడు తుపానులు మాత్రమే ఏర్పడ్డాయి. అవి 1944, 1964, 1976ల్లో సంభవించాయని ఐఎండి తెలిపింది. కచ్చా తీరంలో, పాకిస్తాన్ సమీప ప్రాంతాల్లో ఏర్పడిన తీవ్రమైన అల్పపీడనం గత ఆరుగంటలుగా గంటకు ఆరు కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా ముందుకు కదులుతోంది. మధ్యాహ్నం 11.30గంటలకు గుజరాత్‌లోని భుజ్‌కు పశ్చిమ-వాయవ్యంగా 190కిలోమీటర దూరంలో కేంద్రీకృతమైందని ఐఎండి తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో భారత తీర ప్రాంతానికి దూరంగా, ఈశాన్య అరేబియా సముద్రంలో పశ్చిమ-వాయవ్య దిశగా ఇది కదులుతుందని వాతావరణ విభాగం తెలిపింది. అల్పపీడన పరిస్థితుల కారణంగా గుజరాత్‌లో గత నాలుగు రోజుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు 26మంది మరణించిన సంగతి తెలిసిందే.

## రాష్ట్రాల రుణ పరిమితిపై రాజ్యాంగ ధర్మాసనం

**సుప్రీంకోర్టులో కేరళ విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం విధించిన పరిమితికి మించి రుణాలను తీసుకోవడానికి రాష్ట్రానికి హక్కు వుందా లేదా అని పరిశీలించేందుకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలంటూ కేరళ ప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టును కోరింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ఎదుట కేరళ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఈ ప్రస్తావన చేశారు. కేరళ ప్రభుత్వం తొలుత దాఖలు చేసిన దావా ప్రాతిపదికన ఈ ఏడాది ఏప్రిల్‌లో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు గురించి ప్రస్తావించింది. దాన్ని పరిశీలించేందుకు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అంగీకరించారు. అయితే ఈ ప్రస్తావనతో కొన్ని ప్రాథమిక ప్రశ్నలు తలెత్తాయి. ఆర్థిక వికేంద్రీకరణ అనేది భారత సమాఖ్యవాదంలో ఒక అంశమా, రాష్ట్రాలపై నికర రుణ పరిమితులను విధిస్తూ కేంద్రం నియంత్రణలు తీసుకువచ్చినట్లైతే అది సమాఖ్యవాదం సూత్రాలను ఉల్లంఘిస్తుందా అనే ప్రశ్నలను ఈ ప్రస్తావన లేవనెత్తింది. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ ఆర్థిక ఆంక్షలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేరళ పట్ల భిన్న వైఖరిని ప్రదర్శిస్తున్నాయా లేదా అనేది కూడా పరిశీలించాల్సిందిగా కోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. కేంద్రం విధించిన రుణ ఆంక్షలు, ఆర్‌బిఐ నిర్వహించే పాత్ర, విధులతో ఘర్షణపడుతున్నాయా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని ద్విసభ్య ధర్మాసనం రాజ్యాంగ బెంచ్‌ను కోరింది. తమ రుణ పరిమితులను కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నియంత్రిస్తోందంటూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన కేసుపై ఈ వాదనలు సాగుతున్నాయి. ఈ ఆంక్షల వల్ల రాష్ట్రం ఆర్థిక అత్యవసర పరిస్థితులను ఎదుర్కొంటోందని కేరళ సర్కార్ చెబుతోంది. వేతనాలు చెల్లించలేకపోతున్నామని, పెన్షన్లు ఇవ్వలేకపోతున్నామని, ఇతర ముఖ్య అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నామని తెలిపింది.

## కృష్ణా జలాల తేనెతుట్టెను కదిపారు

(మొదట పేజీ తరువాయి)

ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తరువాతనే బేసిన్‌లోని వాటి సంగతి కూడా ట్రిబ్యునల్ పేర్కొంది.

**పూర్తికాని పోలవరంనూ...**

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం అంశం ఇప్పటికీ తేలలేదు. ఇదీ తేలకుండా ప్రాజుక్టు కొలిక్కి వచ్చే అవకాశం లేదు. మరోవైపు కొత్త వివాదాలూ చుట్టుముడుతున్నాయి. దీంతో ఎప్పటికి పూర్తవుతుందో అర్థం కాని పరిస్థితి అయినా, పోలవరం ప్రాజెక్టు ద్వారా తరలిస్తున్న నీటిని ట్రిబ్యునల్ పరిగణలోకి తీసుకుంటోంది. గోదావరి జలాల తరలింపు కారణంగా కృష్ణా జలాల్లో 45 టిఎంసిలను తెలుగు రాష్ట్రాలకు పున:పంపిణీ చేయాల్సిన అంశాన్ని ప్రస్తావించింది. తెలంగాణకు 125 టిఎంసిల కేరీ ఓవర్ స్టోరేజిలో 125 టిఎంసిలను కేటాయించే అంశాన్ని పరిశీలించనున్నట్లు పేర్కొంది.

**సుప్రీంను ఆశ్రయిస్తాం : ఇఎన్‌సి**

బచావత్, బ్రిజేష్ ట్రిబ్యునల్ అవార్డుల మేరకు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన కెఆర్‌ఎంబి ఆదేశాలను మాత్రమే పాటించాలని కోరుతున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ ఇఎన్‌సి ఎం. వెంకటేశ్వరరావు ప్రజాశక్తికి తెలిపారు. ఈ మేరకు సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన కృష్ణా ట్రిబ్యునల్ సమావేశంలో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు.

# మా ప్రభుత్వంపై కుట్ర పన్నుతున్నారు!



**హోండూరస్ అధ్యక్షురాలు జియోమారా కేస్ట్రో**

**తెగుసిగల్ప :** తమ వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని హోండూరస్ అధ్యక్షురాలు జియోమారా కేస్ట్రో పేర్కొన్నారు. అమెరికాతో ఖైదీల అప్పగింత ఒప్పందాన్ని ఉపసంహరించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేసిన వెంటనే ఆమె స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. హోండూరస్, వెనిజులా రక్షణ అధికారుల మధ్య సమావేశంపై అమెరికా రాయబారి ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందం నుండి బయటకు రావాలని హోండూరస్ అధ్యక్షురాలు నిర్ణయించారు. అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ఈ ఒప్పందాన్ని అమెరికా ఉపయోగించుకుంటోందని ఆమె విమర్శించారు. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని, సాయుధ బలగాల చీఫ్, రక్షణ మంత్రిలపై బుధవారం దాడి జరిగిందని ఆమె చెప్పారు. ఇటువంటి దాడుల వల్ల సాయుధ బలగాల వ్యవస్థ బలహీనమవుతుందన్నారు. ప్రస్తుతం తాము ఎన్నికల ప్రక్రియపైనే దృష్టి పెట్టామన్నారు. కుట్ర అంటేనే హింస, వేధింపులు, మానవ హక్కుల ఉల్లంఘనలని ఆమె వ్యాఖ్యానించారు.

## పాక్‌తో చర్చల శకం ముగిసినట్లే !

**• విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్‌తో చర్చలు జరిపే శకం ఇక ముగిసి పోయిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వ్యాఖ్యానించారు. రాయబారి రాజీవ్ సిక్రి రాసిన కొత్త పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్‌తో భారత్ సంబంధాలపై ఆయన వివరంగా మాట్లాడారు. "పాక్‌తో నిరంతరంగా చర్చలు జరిపే శకం ముగిసినట్లేనని నేను భావిస్తున్నా. చర్యల వల్ల పర్యవసానాలు వుంటాయి. జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించినంతవరకు, చేయాల్సింది 370వ అధికరణ చేసిందనుకుంటున్నాను. ఇక పాకిస్తాన్‌తో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవాలని మనం ఆలోచిస్తాం. ప్రస్తుతమున్న సంబంధాలతో భారత్ సంతృప్తిగా వుండి వుంటుందని రాజీవ్ సిక్రి తన పుస్తకంలో పేర్కొన్నారు. అది నిజమో కాదో...మేం నిష్క్రియాపరులం కాదు, సానుకూల దిశలో లేదా ప్రతికూల దిశలో ఏ సంఘటనలు చోటు చేసుకున్నా కచ్చితంగా మేం స్పందిస్తాం." అని జై శంకర్ పేర్కొన్నారు.

## 610 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేసిన బీమా కంపెనీలు

**• అవివా 5.2 మిలియన్ డాలర్ల ఎగవేత**

**న్యూఢిల్లీ :** భారత్‌లోని ప్రయివేటు బీమా కంపెనీలు భారీగా పన్ను ఎగవేతలకు పాల్పడుతున్నాయి. దీనిపై విచారణను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ విషయాన్ని ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. 2017 నుంచి బీమా కంపెనీలు దాదాపు 610 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేతకు పాల్పడ్డాయి. దీనిపై 2022 నుంచి భారత ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. బ్రిటన్‌కు చెందిన అవివా ఇండియా నకిలీ ఇన్‌వాయిస్‌లు (సేవల రసీదు లేకుండా) ద్వారా పన్నుల చెల్లింపుల నుంచి తప్పించుకుంటున్నట్లు అధికారులు గుర్తించారని, ఈ నెల ప్రారంభంలో అవివాకు డైరక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) నోటీసులు కూడా జారీ చేశారని రాయిటర్స్ తెలిపింది. ఈ పన్ను నోటీసు ప్రకారం అవివా సంస్థ 2017 నుంచి 2023 వరకూ దేశంలో విక్రయదారులకు 26 మిలియన్ డాలర్లు చెల్లించింది. అయితే వీరంతా కూడా సేవలను అందించలేదని, దీనికి బదులుగా అవివా ఏజెంట్లుకు నిధులు చేరవేసేందుకు మధ్యవర్తులుగా వ్యవహరించారు. దీని వలన అవివా సంస్థ భారత ప్రభుత్వానికి 5.2 మిలియన్ డాలర్ల పన్ను చెల్లించకుండా తప్పించుకోగలిగింది. ఈ విషయం ఇంగ్లండ్‌లోని సంస్థలోని సీనియర్ అధికారులకు కూడా తెలుసు. అవివాతో పాటు దేశంలోని మరో 12కుపైగా బీమా సంస్థలు కూడా పన్ను ఎగవేతకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. 2017 నుంచి పన్ను ఎగవేతలకు పాల్పడుతున్నారనే అభియోగాలతో బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లకు గత ఏడాదిలో షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## వెస్ట్ బ్యాంక్‌లో దాడులను తక్షణమే ఆపాలి

**• ఇజ్రాయిల్‌ను కోరిన యుఎన్ చీఫ్**

**న్యూయార్క్ :** ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో మిలటరీ దాడులను తక్షణమే ఆపాల్సిందిగా ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటానియో గుటెరస్ ఇజ్రాయిల్‌ను కోరారు. మంగళ, బుధవారాల్లో అక్కడ జరిగిన దాడుల్లో 16 మంది మరణించారు. ఈ ప్రమాదకరమైన పరిణామాలతో పరిస్థితులు మరింత పెచ్చరిల్లుతాయని, పాలస్తీనా అథారిటీ మరింత దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు. ఆక్రమణలు ఆపి, అర్థవంతమైన చర్చల ప్రక్రియకు వెళితేనే పరిష్కారం దొరుకుతుందన్నారు. రెండు దేశాల ఏర్పాటు హింసకు ముగింపు పలుకుతుందని పేర్కొన్నారు.

ఇజ్రాయిల్‌తో సంబంధాలపై ఇయు పునరాలోచించాలని ఐర్లాండ్ విదేశాంగ మంత్రి కోరారు. ఇది కేవలం హమాస్‌పై పోరాటం కాదని, మొత్తంగా పాలస్తీనియన్లపై యుద్ధమని మంత్రి మార్టిన్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. గాజాపై సాగిస్తున్న మారణకాండ నేపథ్యంలో నెతన్యాహు, ఆయన మంత్రివర్గ సభ్యులపై ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలించాలంటూ ఇయు విదేశాంగ విధాన చీఫ్ జోసెఫ్ బోరెల్ ఇయు సభ్య దేశాల విదేశాంగ మంత్రులను కోరారు.

**ఆయుధ ఆంక్షలకు పెరుగుతున్న డిమాండ్**

గాజాలో గత పది నెలలుగా సాగిస్తున్న మారణహోమానికి తోడు, గత రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేని విధంగా వెస్ట్ బ్యాంక్‌లో తాజాగా ఇజ్రాయిల్ మిలటరీ దాడులు జరుపుతున్న నేపథ్యంలో ఇజ్రాయిల్‌కు అందచేసే ఆయుధాలపై బ్రిటన్ తక్షణమే ఆంక్షలు విధించాలని మానవ హక్కుల కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. కేంపైన్ అగైనెస్ట్ ఆర్మ్స్ ట్రేడ్ డేటా ప్రకారం 2015 నుండి ఇప్పటివరకు బ్రిటన్ మిలటరీ 48.9కోట్ల పౌండ్ల విలువ చేసే ఆయుధాలను ఇజ్రాయిల్‌కు ఎగుమతి చేసింది. ఒకపక్క ఆయుధాల సరఫరా ఆపాలని డిమాండ్ చేస్తుంటే గాజాపై దాడులు ఆరంభమైనప్పటి నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్‌కు 108 లైసెన్స్‌లను జారీ చేశారు. మరోవైపు ఇజ్రాయిల్ ఇలా రెచ్చిపోవడం చూస్తుంటే కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవాలన్న ఉద్దేశ్యమే ఇజ్రాయిల్‌కు లేదని స్పష్టంగా తెలుస్తోందని ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ జస్టిస్ ఫర్ పాలస్తీనియన్స్ పేర్కొంది. ఇజ్రాయిల్ సాగించే దారుణాలతో నిర్వాసితుల సంఖ్య పెరుగుతోందని, కీలకమైన మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతున్నాయని అమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కి చెందిన ఎరికా గువెరా విమర్శించారు.

## గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో దారుణం

(మొదట పేజీ తరువాయి)

కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సుమోటోగా కేసు తీసుకున్న మహిళా కమిషన్**

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో సీక్రెట్ కెమెరాల వ్యవహారాన్ని మహిళా కమిషన్ సుమోటోగా కేసు తీసుకుంది. దీనిపై కళాశాల యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినట్లు ఛైర్‌పర్సన్ గజ్జెల వెంకటలక్ష్మి తెలిపారు. దీనిపై ప్రభుత్వం కూడా స్పందించి వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. యాజమాన్యం విచారణకు హాజరు కావాల్సి ఉందని, ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

**ఐదుగురు మహిళా సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు : కొల్లు రవీంద్ర**

పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. విచారణకు ఐదుగురు మహిళా సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డికె బాలాజీ, ఎస్‌పి గంగాధరరావు శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాలకు వచ్చి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని తెలిపారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను వేధింపులకు గురిచేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

**న్యాయం జరిగే వరకూ కళాశాలకు వెళ్లం**
**మంత్రికి స్పష్టం చేసిన విద్యార్థినులు**

కళాశాల యాజమాన్యంపై తమకు నమ్మకం లేదని, రహస్య కెమెరాల విషయం వారం రోజుల క్రితమే కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా నొక్కి పెడుతోందని మంత్రి దృష్టికి విద్యార్థినులు తెచ్చారు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేస్తే చర్యలు ఉంటాయని యాజమాన్యం బెదిరిస్తోందని వాపోయారు. తమకు న్యాయం జరిగే వరకూ కళాశాలకు వెళ్లబోమని వారు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, కళాశాల విద్యార్థినులకు పూర్తి రక్షణ కల్పిస్తామని, ఈ సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వసతి గృహం వార్డెన్, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**రహస్య కెమెరాలు లేవు : ఎస్‌పి గంగాధరరావు**

ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సంఘటనపై జిల్లా ఎస్‌పి గంగాధరరావు మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో ఎలాంటి రహస్య కెమెరాలూ లేవన్నారు. నిందితుల ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరిశీలించి నట్లు చెప్పారు. విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఈ ఘటనపై విచారణకు గుడివాడ క్రైమ్ సిఐ రమణమ్మను ప్రత్యేక విచారణ అధికారిగా నియమించారు. ఆమెతోపాటు మరో ఐదుగురితో విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు.

**కాలేజీ అనుమతులు రద్దు చేయాలి : వైసిపి**

గుడ్లవల్లేరు ఇంజనీరింగు కాలేజీ అనుమతులను రద్దు చేయాలని వైసిపి ప్రతినిధి పుత్తా శివశంకర్ డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థినులు వర్షాన్ని లెక్క చేయకుండా గంటల తరబడి నిరసనలు చేస్తున్నా పోలీసులు వెంటనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా హోంమంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు.

**దోషులను శిక్షించాలి : పురందేశ్వరి**

గుడ్లవల్లేరు కళాశాల లేడీస్ హాస్టల్‌లో సిసి కెమెరాలు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు.

## అడవుల విధ్వంసం సహించబోం

(మొదట పేజీ తరువాయి)

జపనీస్ టెక్నాలజీ మియావకీ విధానంలో మొక్కలు నాటుదామని చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను మియావకీకి కలిపితే మంచి ఫలితాలు సాధించవచ్చునని అన్నారు. ఈ ఏడాది కోటి చెట్లు నాటేలా లక్ష్యం పెట్టుకోవాలని చెప్పారు. దీనివల్ల 0.33 శాతం గ్రీన్ కవర్ పెరుగుతుందన్నారు. చెట్లు ఎక్కువగా నాటిన వారికి ప్రతియేటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న అవార్డులు అందిస్తామన్నారు. అడవులను నరికేస్తున్నారని, కొంతమంది కాలువలు, చెరువులను కబ్జా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల కరువు, కాటకాలు, భారీ తుపానులు వస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం సహజ వనరులను దోపిడీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వ్యక్తులను ప్రోత్సహించిందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన పోలీసులే భక్షకులుగా మారి ఇబ్బందులు పెట్టారని సినీనటి కాదంబరి అంశాన్ని చంద్రబాబు ప్రస్తావించారు.

**మియావకీ విధానంలో వనాల అభివృద్ధి : పవన్‌కల్యాణ్**

జపాన్‌లో అవలంభిస్తున్న మియావకీ అటవీ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ విధానం తక్కువ విస్తీర్ణంలో తక్కువ ఖర్చుతో అడవుల్ని పెంచడమని చెప్పారు. దీనివల్ల వేగంగా అడవులు, పచ్చదనం పెరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో అడవులను తలపించే వనాలు సిద్ధమవుతాయని వెల్లడించారు. వీటిపై ప్రతి ఒక్కరూ దృష్టిపెడితే ఇందుకు సంబంధించిన విధానాన్ని, సూచనలను ప్రభుత్వం తరపున ఎప్పటికప్పుడు ప్రజలకు చెబుతామన్నారు. చెట్లను పెంచడం బాధ్యతగా తీసుకోవాలని వెల్లడించారు. గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చెట్లు నరికేసిందని విమర్శించారు. చెట్టును కూల్చడం తేలికని, అది పెరగడానికి ఏళ్లు పడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ భావితరాల కోసం మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం పచ్చదనం 29 శాతం ఉందని, దీనిని 50 శాతానికి పెంచాలని కోరారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విత్తనానికి, మనిషి జీవితానికి పోలిక ఉందన్నారు. భూమిని చీల్చుకుంటూ విత్తనం బయటకు వస్తుందని, మనుషులు అలా ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలనే ప్రతిజ్ఞను మంగళగిరిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని వేదవాణితో చంద్రబాబు, పవన్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏసురత్నం, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము, అటవీదళాధిపతి చిరంజీవి చౌదరి, అటవీశాఖ ఉన్నతాధికారులు శాంతిప్రియా పాండే, రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టరు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మీ కోసం



అగరొత్తుల ఖాళీ పెట్టెలను బీరువాలో చీరల మధ్య ఉంచితే చీరలు కూడా సుగంధాలు విరజిమ్ముతాయి.

## జీవన సౌరభం

వ్యతిరేకత అనేది కార్యసాధకుడిలో పట్టుదలను పెంచుతుందే కానీ కార్య విరమణకు పురికొల్పదు.

JEEVANA జీవన the family

# పంటి కింద రాయి



వేణుగోపాలరావు మాస్టారు సాంఘికశాస్త్రం బోధించేవారు. ఆయన తెలుగు భాషాభిమాని. తెలుగు భాష మీద మక్కువతో రోజూ సాయంత్రం పూట పిల్లలందరినీ కూర్చోబెట్టి నుడికారాలు, లోకోక్తులు భాషా సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తాయంటూ సామెతల కథలు, పొడుపు కథలు చెప్తారు. తెలుగుభాష మీద మమకారం పెంపొందించడం కోసం ఆట, పాట, మాటలతో కృత్యాలు చేయిస్తారు. గేయాలు రాగయుక్తంగా పాడక పోయినా, ఒత్తులు దీర్ఘాలు సరిగ్గా పలక లేకపోయినా, రాసేటప్పుడు అక్షరదోషాలు ఉన్నా 'పంటికింద రాయిలా' ఉంది అనేవారు. పంటికింద రాయంటే ఏమిటో అర్థం కాలేదు పిల్లలకు. హాసిని ధైర్యం చేసి 'మాస్టారు పంటి కింద రాయి అంటే ఏమిటి?' అని అడిగింది. 'పూర్వం రోజుల్లో కందులు, పెసలు మొదలైనవి పండించి, ఆ పంటను పొలం నుంచి ఇంటికి తెచ్చేవారు. ఇంటి దగ్గర దినుసులను చేటతో చెరిగి, జల్లెడతో జల్లించి శుభ్రం చేసేవారు. అవసరాల నిమిత్తం ఇంట్లో వాడుకునేవారు.

ఒకసారి పండుగ సందర్భంగా ఒక ఇల్లాలు పప్పు వండి, ఇంట్లో వాళ్లందరికీ వడ్డించింది. ఎంతో ఇష్టంగా అందరూ తింటూ ఉండగా 'పంటి కింద రాయి' పడి కరేల్ మనడంతో చిరాకుపడ్డారు. 'పప్పులో రాళ్ళు ఉండిపోయాయే' అని ఆవిడ ఎంతో బాధపడింది. అప్పటినుంచి పంటి కింద రాయి అనే జాతీయం వాడుకలోకి వచ్చింది.

పప్పులోని రాయి పంటి కింద పడి, తినడానికి ఎలా చిరాకనిపించిందో, అలాగే ఉచ్చారణ దోషాలు, ముద్రారాక్షసాలు లేదా అక్షర దోషాలు భాషా సౌందర్యాన్ని, విలువను తగ్గించేస్తాయి. మధురమైనది మన తెలుగుభాష, తేనెలొలుకు భాష మన తెలుగు భాష. అజంత భాష మన తెలుగు భాష. అన్య భాషల కన్న అమ్మ భాషే మిన్న' అని వివరించారు మాస్టారు. నాటి నుంచి సాధన చేసి పలకడంలో, రాయడంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడ్డారు పిల్లలు. అమ్మదనం నిండిన కమ్మనైన తెలుగును మెరుగు పరచుకున్నారు.

**- కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.**


## నీడను కనిపెట్టండి

**పిల్లలూ, ఇక్కడ పైన ఇచ్చిన బొమ్మల నీడలు కింద వరుసలో గజిబిజిగా ఉన్నాయి. సరైన నీడ కనిపెట్టండి చూద్దాం.**



## నేను గీసిన బొమ్మ





**సిహెచ్. కార్తీక్, 6వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్ నిజాంపేట, మెదక్‌జిల్లా.**

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**

# రంగస్థలానికి నేపథ్య సంగీతకర్తగా ...





**సాంఘిక నాటకాలకు వాయిద్య సహకారం అందిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రంగస్థలంపై చెరగని ముద్ర వేసుకున్నారు కాయితి సత్యనారాయణ. తన సంగీతంతో ఆయన ఆబాల గోపాలాన్ని ఓలలాడిస్తూ ఆ ఝురిలో ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచానికి తీసుకెళ్తారు. విశాఖపట్టణంలోని ఎసిబి కోర్టులో సెలక్షన్ గ్రేడ్ టైపిస్ట్‌గా పనిచేసిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం కళామతల్లి సేవలో తరిస్తున్నారు.**

సత్యనారాయణ అమ్మమ్మ చిట్టెమ్మ హార్మోనియం ప్లేయర్. తల్లి కె.వెంకటరమణి కూడా హార్మోనియం వాయిస్తూ ఎంతో హృద్యంగా పాటలు పాడేవారు. చిన్నతనంలో వీరిద్దరి వద్ద నుంచి సంగీతంలో ఓనమాలు నేర్చుకున్న సత్యనారాయణ ఆ రంగంలో మంచి నిపుణుడిగా రాణించాలని భావించారు. ఆయన తండ్రి అప్పారావు సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేశారు. ఆయన అప్పాజీ పేరుతో వివిధ పత్రికలకు కథలు, కవితలు, రచనలు రాసేవారు. తల్లి 'జీవితమే సఫలము' తదితర పాటలు పాడుతూ, నిద్రపుచ్చేందుకు పాడేవారు. అప్పాజీ రాసిన పాటలను కూడా ఆమె ఆలపించేవారు.

**చిన్నప్పుడే పాటలతో ప్రవేశం**

ఇంట్లో హార్మోనియం ఉండటంతో దానిని వాయిస్తూ సత్యనారాయణ కూడా చిన్న చిన్న పాటలను ప్రాక్టీస్ చేసేవారు. 1968లో విఠలాచార్య 'బొమ్మలు చెప్పిన కమ్మని కథలు' సినిమాలో 'నీలి మేఘమాలవో' సాంగ్ మొదటిసారిగా హార్మోనియంపై ప్రాక్టీస్ చేశారు. హార్మోనియంతోపాటుగా మాండొలిన్, గిటార్ కూడా ప్రాక్టీస్ చేశారు. ఆర్కెస్ట్రాలో ఉండేవారు. విశాఖలోని ఎవిఎన్ కళాశాల డిగ్రీ పూర్తయిన తర్వాత ఎసిబి కోర్టులో టైపిస్ట్‌గా ఉద్యోగంలో చేరారు. అప్పటికే విశాఖలోని పలు నాటక సమాజాలతో పరిచయాలు ఏర్పడ్డాయి.

**కొండవలస, మిశ్రో బృందాలతో కలిసి ...**

1984లో కొండవలస లక్ష్మణరావు బృందానికి, ఆ తర్వాత విశాఖ పోర్ట్ ట్రస్ట్ మెడికల్ విభాగం తరపున కొండవలస దర్శకత్వంలో ప్రదర్శించిన పలు డ్రామాలకు సత్యనారాయణ వాయిద్య సహకారం అందించారు. ఎస్కె మిశ్రో ఆయన ప్రతిభను గమనించి బహురూప నట సమాఖ్య టీంలోకి అవకాశాన్ని కల్పించారు. కొండవలస వారి 'నథింగ్ బట్ ట్రూత్' అనే నాటికకు మొట్టమొదటిసారిగా నేపథ్య సహకారం సత్యనారాయణే అందించారు. ఆ ప్రదర్శన షిప్‌యార్డు లలిత కళామందిర్‌లో జరిగింది. సత్యనారాయణ నేపథ్య సంగీతానికి ఉత్తమ సంగీత కళాకారుడిగా బహుమతి వచ్చింది. ఆ నాటిక ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా నిలిచింది. ఆ ఉత్సాహంతో ఆయన నాటక రంగంపై మరింత ఆసక్తి పెంచుకున్నారు. ఆర్కెస్ట్రా రంగానికి స్వస్తి పలికి కేవలం నాటకాలకు అన్ని స్వరాలను అందించేలా కీబోర్డు వాయించటాన్ని నేర్చుకున్నారు.

1984 నుంచి 2016 వరకూ మిశ్రో చేసిన అన్ని నాటిక, నాటకాలకు పనిచేశారు. కోర్టులో టైపిస్టుగా పనిచేస్తున్నందున పెద్దగా సెలవులు దొరికేవి కావు. దీంతో, దూర ప్రాంతాలకు కాకుండా విశాఖపట్టణంలోని వైజాగ్ పోర్టు, బిహెచ్‌పివి, షిప్‌యార్డ్ టీములు, ఇతర స్థానిక డ్రామా బృందాలకు పనిచేస్తుండేవారు. ఆదివారం, ఇతర పండుగ సెలవుల్లో బయట పరిషత్‌లకు కొండవలస లేదా మిశ్రో బృందాలతో కలిసి వెళుతుండేవారు. ఉద్యోగ విరమణ తర్వాత అన్ని టీములకు వీలైనప్పుడల్లా వెళ్లి వస్తుండేవారు. 1984 నుంచి ఇప్పటి వరకూ ఏటా 70 నాటిక, నాటక ప్రదర్శనలకు సంగీతాన్ని అందిస్తూ వస్తున్నారు. ఇలా సుమారు 2500 ప్రదర్శనలను సంగీతాన్ని సమకూర్చారు ఆయన.

**సంగీతానికి మరింత ప్రాధాన్యం**

ఉరుకుల పరుగుల జీవితం, వివిధ ఒత్తిళ్లలో ఆనందం, ఆస్వాదం కోసం ప్రతిఒక్కరూ సంగీతాన్ని ఆశ్రయిస్తున్నారు. ఓ గంట సమయం నాటిక ద్వారా ప్రేక్షకులకు మధురానుభూతిని ఇచ్చే ప్రయత్నంలో నేను కూడా పాలు పంచుకుంటున్నా. ఈ నా ప్రయాణంలో నేటికీ నిత్య విద్యార్థిగా ఎన్నో కొత్త మెలకువలను నేర్చుకుంటున్నా.

**- కాయితి సత్యనారాయణ**

**'మధుపర్కాలు'కు నంది అవార్డు**

అరవిందా ఆర్ట్స్ తాడేపల్లి (గంగోత్రిసాయి) టీంలో ఫిబ్రవరి 2017 నుంచి పనిచేస్తున్నారు. 2017లో 'మధుపర్కాలు' నాటికకు ఆయన అందించిన సంగీతానికి నంది అవార్డు వచ్చింది. 2019లో మధుపర్కాలు నాటికను ఒకే రోజు పగలు ఖమ్మంలో, సాయంత్రం ఒంగోలులో ప్రదర్శించడం దానికి ఆయన నేపథ్య సంగీతం అందించడం అరుదైన ఘటన. దూరదర్శన్‌లో వచ్చిన 'జీవన సంధ్య', 'పులిస్వారీ', 'రేపటిశత్రువు' నాటిక ప్రదర్శనలకు వాయిద్య సహకారం అందించారు. విశాఖలోని రామ్మూర్తి థియేటర్‌లో 'అయ్యప్పస్వామి' డ్రామాకు వరుసగా 40 రోజులు లైవ్ మ్యూజిక్ అందించారు.


**విశాఖలో పోటాపోటీ ప్రదర్శనలు**

అప్పట్లో విశాఖ షిప్‌యార్ట్ లలిత కళామందిర్ థియేటర్‌లో నాటిక, నాటిక పోటీల ప్రదర్శనలను టిక్కెట్లు కొనుగోలు చేసి చూడాల్సి వచ్చేది. కొన్నిసార్లు టిక్కెట్లు కూడా దొరికేవికావు. కొండవలస లక్ష్మణరావు, మిశ్రో, నూతనప్రసాద్ తదితరుల టీములు పోటీ పడేవి. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు 50 – 70 మంది ఆయా టీముల్లో ఉండేవారు. 1984లో 'వేటకుక్కలు' నాటకం హైదరాబాదులో బెల్, హెచ్‌ఎంటి, రవీంద్రభారతిలలో ప్రదర్శితమైంది. సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ జయప్రకాష్‌రెడ్డి బెంగుళూరులో ప్రదర్శించిన 'అలెగ్జాండర్'కు; జె.వి.సోమయాజులు 'కన్యాశుల్కం' నాటకానికి సత్యనారాయణ నేపథ్య సంగీతం అందించారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా రంగస్థల ప్రదర్శనల్లో నేపథ్య సంగీతానికి చిరునామాగా ఆయన ఉన్నారు.





## డిసెంబర్ 6న 'పుష్ప2' విడుదల పక్కా

అల్లు అర్జున్ నటిస్తున్న చిత్రం 'పుష్ప 2'. గత మూడేళ్లుగా ఈ సినిమా షూట్ కొనసాగుతూనే ఉంది. వాస్తవంగా ఈ సినిమా ఆగస్టు 15నే థియేటర్లలోకి రావాల్సివుంది. కానీ షూటింగ్ ఆలస్యం కావటంతో డిసెంబర్ 6న వస్తున్నట్లుగా ప్రకటించారు. మరోసారి వాయిదా తప్పదనే ప్రచారం వస్తుండటంతో చిత్రబృందం వివరణ ఇచ్చింది. వాస్తవానికి డిసెంబర్ 6న పలు పెద్ద చిత్రాలు కూడా విడుదల కానుండటంతో ఈ తరహా కథనాలు వస్తున్నాయి. తాజాగా 'మత్తు వదలరా 2' ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. పుష్ప తీస్తున్న మైత్రీ మూవీమేకర్స్ ఈ చిన్న మూవీని కూడా నిర్మిస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత రవిశంకర్ యలమంచిలి మాట్లాడారు. సెప్టెంబర్ 2 కల్లా ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్, అక్టోబర్ 6 కల్లా సెకండాఫ్ ఎడిటింగ్ పూర్తవుతుందన్నారు. నవంబర్ 20 కల్లా ఫైనల్ కాపీ సిద్ధమవుతుందని క్లారిటీ ఇచ్చారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో మిగతా పాటల్ని రిలీజ్ చేస్తామన్నారు. నవంబర్ 25న సెన్సార్ పూర్తిచేసి డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తామని వివరించారు. ఇదిలావుండగా నటుడు రావు రమేష్ 'పుష్ప 3' కూడా ఉంటుందనే హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే.



## 11న సూర్యకాంతం శతజయంతి సభ

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అత్త క్యారెక్టర్‌గా జీవించి ఆంధ్రా అత్తగా గుర్తింపు పొందిన కీర్తిశేషురాలు సూర్యకాంతం శతజయంతి వేడుకలు జరుగుతున్నాయి. గతేడాది నవంబర్ 5న చెన్నైలో ఈ వేడుకలను మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రారంభించారు. అనంతరం ఆంధ్రు అభిమాన అత్తగారు' పుస్తకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఈనేపథ్యంలో సెప్టెంబర్ 11న ఉదయం 10 గంటలకు సూర్యకాంతం అభిమానులు విశాఖపట్టణం ఆంధ్రాయూనివర్శిటీలోని హిందీవిభాగం హాలులో సభను ఏర్పాటుచేశారు. ఈ సభలో సూర్యకాంతంపై రూపొందించిన డాక్యుమెంటరీని కూడా ప్రదర్శిస్తారని ఆమె కుమారుడు డాక్టర్ అనంతపద్మనాభమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ప్రముఖ నటులు తనికెళ్ల భరణి, ఎస్వీ రామారావు, వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు హాజరవుతున్నారని వివరించారు.



## జనవరిలో 'కల్కి' సీక్వెల్


ప్రభాస్–నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదలైంది. ప్రభాస్ భైరవ పాత్రలో మెప్పించారు. వైజయంతి మూవీస్ బ్యానర్‌లో సి.అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మించారు. ఈ మూవీకి సీక్వెల్ ఉంటుందని ఇప్పటికే మేకర్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్స్‌ను మేకర్లు ఇచ్చారు. ఇటీవల రష్యాలోని మాస్కోలో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్ వీక్‌లో నిర్మాతలు స్వప్నదత్, ప్రియాంకదత్ కూడా పాల్గొన్నారు. ఈవెంట్‌లో 'కల్కి–2' షూటింగ్‌కు సంబంధించి అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ షూట్ వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కల్కి మూవీని త్వరలోనే రష్యన్ భాషలోనూ రిలీజ్ చేయనున్నట్లు మేకర్లు ప్రకటించారు. ఈ చిత్రంలో కమల్‌హాసన్, అమితాబ్‌బచ్చన్, దీపికా పదుకొణె, దిశా పటానీ లాంటి స్టార్లు నటించిన విషయం తెలిసిందే. రాజమౌళి, రాంగోపాల్‌వర్మ, మృణాల్ ఠాకూర్; విజయ్‌దేవరకొండ, దుల్కర్ సల్మాన్ లాంటి ప్రముఖులు అతిథి పాత్రల్లో మెరిశారు. ఈ మూవీలోని బుజ్జి కారుకు కీర్తి సురేశ్ వాయిస్ ఇచ్చారు. అయితే పార్టు–2లో కమల్‌హాసన్ పాత్ర ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే నాగ్‌అశ్విన్ హింట్ ఇచ్చారు. దీంతో పార్టు–2 ఎలాంటి ఉంటుందనే ఆత్రుత ఇప్పటి నుంచే అభిమానుల్లో నెలకొంది.

## సినిమా పరిశ్రమంతటా వేధింపులే : నటి శాంతిప్రియ



మలయాళ ఇండస్ట్రీలో హేమ కమిటీ నివేదికపై టాలీవుడ్ నటి శాంతిప్రియ స్పందించారు. ఇలాంటి వేధింపులు కేవలం మాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాదు. అన్ని చోట్లా జరుగుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మన భవిష్యత్తు తరాలకు భరోసానిచ్చేలా చర్యలు ఉండాలని సూచించారు. మలయాలం మూవీ ఆర్టిస్టుల సంఘం అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేయటం ఏమాత్రం సమంజసం కాదన్నారు. హేమ కమిటీ నివేదిక తర్వాత ఆరోపణలు వస్తున్న సమయంలో తప్పుకోవటడం సరైన నిర్ణయం కాదన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు అండగా నిలబడాలని సూచించారు. బాధితులకు భరోసా కల్పించే బాధ్యత 'అమ్మ' సమస్యలపై ఉందని గుర్తుచేశారు. తనకు ఇలాంటి పరిస్థితులెప్పుడూ ఎదురుకాలేదన్నారు. భానుప్రియ సోదరురాలిని కావటం వల్ల తనను ఎవ్వరూ టచ్‌చేయలేదన్నారు.

## 6న ఓటీటీలో 'కిల్' స్ట్రీమింగ్



బాలీవుడ్‌లో హిట్‌టాక్‌ను అందుకున్న 'కిల్' సినిమా సెప్టెంబర్ ఆరోతేదీన ఓటీటీలో స్ట్రీమింగ్‌కానుంది. లక్ష్ లాల్వానీ, తాన్య మనక్తిలా జంటగా నటించి ఈ సినిమా జులై ఐదోతేదీన విడుదలైన విషయం తెలిసిందే. అప్పట్లో 'కల్కి 2898ఏడీ'తో గట్టిపోటీ ఎదుర్కొని బాక్సాఫీస్ వద్ద సత్తాచాటింది. ధర్మా ప్రొడక్షన్స్‌పై నిఖిల్ నగేశ్ భట్ దర్శకత్వం వహించిన 'కిల్' గతేడాదిలో నిర్వహించిన టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. యూకే, అమెరికా వంటి దేశాల్లో ఈ సినిమా ఇప్పటికే అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా డిస్నీహాట్ స్టార్ వేదికగా భారత్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హిందీలో మాత్రమే అందుబాటులోకి రానుందని మేకర్లు తెలిపారు. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం వంటి భాషల్లో ఎప్పుడు విడుదల కానుందనేది ఇంకా వెల్లడించలేదు.

# చరిత్ర సృష్టించిన అవని

## వరుసగా రెండో పారా ఒలింపిక్స్‌లోనూ స్వర్ణం



- **మనీష్‌కు రజతం, మోనాకు కాంస్యం**
- **100మీ. పరుగులో ప్రీతి రికార్డు**
- **ఒకేరోజు భారత్ ఖాతాలో నాలుగు పతకాలు**



మనీష్ నర్వాల్(రజతం)



మోనా అగర్వాల్(కాంస్యం)



ప్రీతి పాల్(కాంస్యం)

**పారిస్:** పారా ఒలింపిక్స్‌లో రెండోరోజు భారత్‌కు ఏకంగా నాలుగు పతకాలు దక్కాయి. షూటింగ్ విభాగంలో మూడు పతకాలు లభించగా.. మరో పతకం అథ్లెటిక్స్ విభాగంలో దక్కింది. టోక్యో పారా ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో మెరిసిన షూటర్ అవని లేఖరా.. పారిస్ పారా ఒలింపిక్స్‌లోనూ పసిడి పతకంతో మెరిసింది. దీంతో వరుసగా రెండు ఒలింపిక్స్‌లోనూ స్వర్ణ పతకాలు పొందిన తొలి పారా షూటర్‌గా అవని చరిత్ర సృష్టించింది.

శుక్రవారం జరిగిన మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్–1 ఫైనల్లో అవని లేఖరా 249.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలి చింది. ఇదే ఈవెంట్‌లో మోనా అగర్వాల్ 228.7 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచి కాంస్య పత కం సాధించింది. కొరియాకు చెందిన లీ(246.8 పాయింట్లు) రజత పతకం కైవసం చేసుకుంది.

**షూటింగ్‌లో మనీశ్‌కు రజతం**

పురుషుల 10మీ. ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 విభాగంలో మనీష్ నర్వాల్ రజత పతకంతో మెరిసాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో మనీశ్ 234.9పాయింట్లతో రెండోస్థానంలో నిలిచి భారత్ ఖాతాలో మరో పతకాన్ని చేర్చాడు. పతక వేటలో మనీష్ మూడు పాయింట్ల తేడాతో స్వర్ణ పతకాన్ని చేజార్చుకున్నాడు. కొరియా పారా షూటర్ జియోంగ్డు జో(237.4పాయింట్లు అగ్రస్థానం నిలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకోగా.. చైనాకు చెందిన యంగ్(214.3పాయింట్లు) కాంస్యం సాధించాడు. టోక్యో పారా ఒలింపిక్స్‌లో మనీశ్ 50మీ. పిస్టల్ విభాగంలో బంగారు పతకం గెలిచాడు.

**అథ్లెటిక్స్‌లో ప్రీతి రికార్డు పతకం...**

మహిళల 100మీ. పరుగులో ప్రీతి పాల్ పారా ఒలింపిక్స్‌లో పతకం చేజిక్కించుకొని చరిత్ర సృష్టించింది. పారా ఒలింపిక్స్ చరిత్రలో 100మీ. పరుగులో భారత్‌కు పతకం దక్కడం ఇదే తొలిసారి. శుక్రవారం జరిగిన మహిళల 100మీ. టి–35 పరుగులో 23ఏళ్ల ప్రీతి 14.21సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం ముద్దాడింది. చైనాకు చెందిన ఝూ సియా(13.58సె.), గువో కియాన్ (13.74సె.) స్వర్ణ, రజత పతకాలు దక్కాయి.


**పతకాల పట్టిక**

| దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|
| 1. చైనా | 7 | 8 | 4 | 19 |
| 2. బ్రిటన్ | 6 | 5 | 3 | 14 |
| 3. బ్రెజిల్ | 4 | 1 | 4 | 9 |
| 4. నెదర్లాండ్స్ | 4 | 1 | 1 | 6 |
| 4. ఇటలీ | 3 | 2 | 7 | 12 |
| 5. ఆస్ట్రేలియా | 3 | 2 | 2 | 7 |
| 6. ఫ్రాన్స్ | 2 | 4 | 2 | 8 |
| 8. కొలంబియా | 2 | 1 | 1 | 4 |
| 9. ఇజ్రాయేల్ | 2 | 0 | 0 | 2 |
| 14. ఇండియా | 1 | 1 | 2 | 4 |


నోట్: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

# పవర్ లిఫ్టింగ్‌లో తెలుగు యువత సత్తా

- **రెండు బంగారు పతకాలు కైవసం**
- **59 కిలోల విభాగంలో మురళీకృష్ణ ప్రపంచ రికార్డ్**
- **57 కిలోల విభాగంలో సాధియాకు స్వర్ణం**



మురళీకృష్ణ



సాదియా అల్మాస్

**ప్రజాశక్తి - స్పోర్ట్స్ డెస్క్**

ప్రపంచ జూనియర్ ఎక్విప్‌డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ – 2024 పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. మాల్టాలో జరుగుతున్న ఈ పోటీల్లో డి మురళీకృష్ణ 59 కిలోల విభాగంలోనూ, షేక్ సాదియా అల్మాస్ 57 కిలోల విభాగంలోనూ స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. మురళీకృష్ణ స్వస్థలం కృష్ణా జిల్లా కాగా ఆయన ఈ పోటీల్లో కడప జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. 59 కిలోల కేటగిరిలో డెడ్‌లిఫ్ట్, స్క్వాట్ లో మొత్తం 633 కిలోలతో ఓవరాల్ గోల్డ్ మెడల్ సాధించారు. జూనియర్ డెడ్‌లిఫ్ట్‌లో 265.5కిలోలతో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్ 57 కిలోల విభాగంలో స్క్వాట్ (190 కిలోలు), డెడ్‌లిఫ్ట్ (175 కిలోలు) మొత్తం 462.5 కిలోలతో ఓవరాల్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ప్రపంచ స్థాయిలో తెలుగుకీర్తిని చాటిన సాదియా, మురళీకృష్ణను ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంటా వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి ఎస్ సూర్యనారాయణ, కోశాధికారి సిహెచ్ శేషుబాబు, గౌరవాధ్యక్షులు ఎం ప్రభాకరరావు అభినందించారు. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొంటున్నారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ తెలిపారు. 47 కిలోల విభాగంలో ఎం షానూన్, 93 కిలోల విభాగంలో సయ్యద్ ఖాజావలి ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

**సిపిఎం అభినందనలు**

ప్రపంచ జూనియర్ పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన షేక్ సాదియా అల్మాస్, మురళీకృష్ణలకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున కార్యదర్శి వి శ్రీనివాస రావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. అల్మాస్, మురళీకృష్ణ ప్రపంచ వేదికలపై మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. యువతీ, యువకులకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమెకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వాలని కోరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68